PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 261 | విజయవాడ, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 26 April 2024 | Rs

JEE MAIN 2024లో

మొత్తం 100 పర్సంటైల్స్ 276 సబ్జెక్టుల్లో*

JEE MAIN 2024లో

ఆలిండియా ఓపెన్ కేటగిరీ 1000 లోపు 222 ర్యాంకులు

39 Years of Excellence 1986-2024

Infinity Learn BY SRI CHAITANYA

ఆలిండియా ఓపెన్ కేటగిరీ టాప్ 1000 లోపు మా 222 ర్యాంకులతో

ఒక నిజం ప్రతిధ్వనిస్తోంది...

తమ పిల్లలు శ్రీచైతన్యతోనే ఉత్తమ ర్యాంకులు సాధిస్తారని

JEE MAIN 2024 ఫలితాలు

300 / 300 MARKS — ఆలిండియా 1 RANK — K.C. BASAVA REDDY, Appl No: 240310618179

300 / 300 MARKS — ఆలిండియా 3 RANK — THOTAMSETTY NIKILESH, Appl No: 240310813888

300 / 300 MARKS — ఆలిండియా 6 RANK — HIMANSHU THALOR (DLP), Appl No: 240310580429

300 / 300 MARKS — ఆలిండియా 9 RANK — REDDI ANIL, Appl No: 240310238514

Sri Chaitanya - Nagpur DLP Student

## ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100లోపు 25 ర్యాంకులు

| Rank | Name | Appl.No. |
|---|---|---|
| 1 | G N NIRMALKUMAR | 240310385062*$ |
| 9 | REDDI ANIL | 240310238514$ |
| 14 | K C BASAVA REDDY | 240310618179* |
| 20 | THOTAMSETTY NIKILESH | 240310813888* |
| 21 | A V TANISH REDDY | 240310807613 |
| 22 | HIMANSHU THALOR | 240310580429*$ |
| 26 | VEDANT SAINI | 240310182830 |
| 28 | P MEET VIKRAMBHAI | 240310157524* |
| 34 | SANVI JAIN | 240310150036* |
| 40 | VISHARAD SRIVASTAVA | 240310046262* |
| 43 | T JAYADEV REDDY | 240310167365 |
| 46 | ISHAAN GUPTA | 240310100229* |
| 49 | MAVURU JASWITH | 240310542275$ |
| 52 | DORISALA SRINIVASA REDDY | 240310682440* |
| 53 | ARCHIT RAHUL PATIL | 240310512311* |
| 57 | KRISHNA AGRAWAL | 240310285850* |
| 60 | AYUSH GANGAL | 240310270709 |
| 68 | PALAGIRI SATHISH REDDY | 240310905497 |
| 70 | MD K GHOUSE MOHIUDDIN | 240310176352 |
| 76 | T V S SAI NAGA BHUSHAN | 240310868568 |
| 92 | M M PRUTHVI RAJ | 240311084545 |
| 93 | M SAI SIVA LOCHAN | 240310866829$ |
| 95 | RAJDEEP MISHRA | 240310265621* |
| 96 | MANOJ SOHAN GAJULA | 240310529661 |
| 98 | KRISH NARSARIA | 240310028286* |

*T & C apply | *DLP | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

## ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS

| Rank | Name | Appl No |
|---|---|---|
| 1 | G N NIRMALKUMAR | 240310385062* |
| 1 | K C BASAVA REDDY | 240310618179# |
| 2 | A SINGH RATHORE | 240310112318& |
| 3 | REDDI ANIL | 240310238514$ |
| 3 | THOTAMSETTY NIKILESH | 240310813888# |
| 5 | VASANTA SRIRAJ | 240310160867# |
| 6 | HIMANSHU THALOR | 240310580429$ |
| 6 | D SRINIVASA REDDY | 240310682440# |
| 6 | T SRI CHANDRAVADAN | 240310166340# |
| 7 | SALLURI VIVEK | 240310251202% |
| 9 | M V MANIKANTA SAI TEJA | 240310867335# |
| 9 | MAVURU JASWITH | 240310542275$ |

25 ర్యాంకులు — ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 100 లోపు

108 ర్యాంకులు — ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 500 లోపు

222 ర్యాంకులు — ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 1000 లోపు

97 ర్యాంకులు — ఆలిండియా ఆల్ క్యాటగిరి 100 లోపు

888 ర్యాంకులు — ఆల్ క్యాటగిరి 1000 లోపు

21,987 Total Qualified Ranks for JEE ADVANCED - 2024

Sri Chaitanya Educational Committee INDIA

శ్రీచైతన్య విద్యాసంస్థలు

www.srichaitanya.net | Ph: 040 660 60606

## పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శి సురేష్ కుమార్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పాలిసెట్-2024 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. పాలిసెట్ నిర్వహణపై సాంకేతిక విద్యాశాఖ కమిషనరు కార్యాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వడగాడ్పుల తీవ్రత నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆయా శాఖల అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పాలిటెక్నిక్ పూర్తయిన వెంటనే సత్వర ఉపాధి కల్పించేందుకు వివిధ పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి మాట్లాడుతూ.. శనివారం జరిగే పాలిసెట్‌కు 1,59,783 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 442 పరీక్ష కేంద్రాలు, 65 సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. కొందరు విద్యార్థులు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. చెల్లుబాటు అయ్యే దరఖాస్తులను పరీక్ష కేంద్రాలకు తీసుకొస్తే అక్కడే నేరుగా ఫీజు కట్టించుకుని హాల్ టికెట్ ఇస్తామని చెప్పారు. ఈ సమీక్షలో సంయుక్త సంచాలకులు వి పద్మారావు, సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జానకీరామ్ పాల్గొన్నారు.

## పున:ప్రవేశంలో ప్రతిభ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో పున:ప్రవేశం పొందిన 1,071 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. గతేడాది పదోతరగతి ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు జిఓ 50 ద్వారా ఈ ఏడాది పున:ప్రవేశం పొందారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో విద్యలో వెనుకబాటుతనం, వైఫల్యాలను ఎదుర్కొన్న విద్యార్థులకు ఇది చక్కని తోడ్పాటు అని అన్నారు. పున:ప్రవేశం పొందడం ద్వారా ఉన్నతస్థాయి తరగతుల సవాళ్లను ధీటుగా ఎదుర్కోవడమే గాక మరింత పట్టుదలగా చదివి మార్కుల్లో గణనీయమైన పెరుగుదల చూపించారని తెలిపారు. గతేడాది 266 మార్కులు సాధించిన విద్యార్థిని ఈసారి 505 మార్కులు సాధించారని వివరించారు.

## చంద్రబాబువి వికృత ఆలోచనలు : సజ్జల

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడితే చంద్రబాబు వికృత ఆలోచనలతో ఎక్స్ వేదికలో ట్వీట్ పెట్టడాన్ని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. 'చెల్లెలి పుట్టుక గురించి మాట్లాడారంటూ వక్రీకరించిన మీ వికృత ఆలోచలు చూస్తే ఎంతగా దిగజారిపోయారో అర్థం అవుతోంది... మీరు పెట్టిన ట్వీట్ చూస్తే.. చివరకు పశువులు కూడా అసహ్యించుకునే స్థాయికి వెళ్లిపోయారని స్పష్టమవుతోంది' అని సజ్జల గురువారం ట్వీట్ చేశారు.

## సిఎం గారూ న్యాయం వైపు నిలవండి

- నిందితుడైతే నా భర్తనైనా అరెస్టు చేయండి : వైఎస్ సునీత

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం వైపు నిలవాలని, వైఎస్ఆర్, వివేకా కష్టంతోనే పులివెందుల వైఎస్ కుటుంబానికి కంచుకోటగా మారిందని వైఎస్ సునీత అన్నారు. వివేకా హత్య కేసులో తన భర్త హంతకుడైతే అరెస్టు చేయాలని వ్యాఖ్యానించారు. చిన్న పిల్లవాడినని వైఎస్ అవినాష్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆమె పులివెందులలో మీడియాతో మాట్లాడారు. బహిరంగ సభలో జగన్ చేసిన వ్యాఖ్యల్లో వివేకాపై ద్వేషం కనిపిస్తోందన్నారు. వివేకా హత్య గురించి మాట్లాడవద్దని మీరే కేసు వేస్తారు.. మళ్ళీ మీరే మాట్లాడతారన్నారు. వివేకా హత్య కేసులో సిబిఐ విచారణ కావాలని హైకోర్టులో కేసు వేసి సిబిఐ నిందితులు అన్న వాళ్లను మీరు రక్షిస్తున్నారని దయచేసి న్యాయం వైపు నిలబడాలని కోరారు. వివేకా కోరికను తీర్చడం కోసమే షర్మిలకు తన మద్దతును ఇస్తున్నానని చెప్పారు. వివేకా హత్య కేసులో ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై చర్చించడానికి మీ ఛానల్‌లోనే లైవ్ డిబేట్‌కు సిద్ధంగా ఉన్నానని.. సిఎం గారు మీరు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

## హేళన చేస్తూ నిందలు మోపడం తగునా?

- సిఎం జగన్‌కు వివేకా భార్య సౌభాగ్యమ్మ లేఖ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

"మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిపై, నీ చెల్లెళ్లు షర్మిల, సునీతపై నిందలు మోపడం నీకు తగునా" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివేకా భార్య వైఎస్ సౌభాగ్యమ్మ బహిరంగ లేఖ రాశారు. న్యాయం కోసం పోరాటం చేస్తున్న వారిపై నిందలు వేస్తూ హేళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్యకు కారణమైన వారికి మళ్లీ ఎంపి అభ్యర్థిగా అవకాశం ఇవ్వడంతో పాటు రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. చెప్పలేని విధంగా వ్యక్తిగత హననం చేయించడం తగునాఅని ప్రశ్నించారు. "న్యాయం, ధర్మం, నిజం వైపు నిలబడాలని వేడుకుంటున్నా" అంటూ లేఖలో పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, ఈమని రామారావు

కర్నూలు జిల్లా కల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న డి.గౌస్ దేశాయ్

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న మండంగి రమణ

# కమ్యూనిస్టులను ఆదరించండి

## వాడవాడలా సిపిఎం అభ్యర్థుల ప్రచారం

**ప్రజాశక్తి-యంత్రాంగం**

రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపిని కేంద్రంలో గద్దె దించాల్సిందేనని సిపిఎం అభ్యర్థులు గురువారం వాడవాడలా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మోడీ, జగన్ ప్రభుత్వాలు కార్పొరేట్ల కోసమే పని చేస్తున్నాయేగానీ.. ప్రజలు, రైతులు, కార్మికుల కోసం కాదని తెలిపారు. రైతులు, కార్మికులు ఏకతాటిపైకి వచ్చి బిజెపిని, దానికి మద్దతిస్తున్న టిడిపి, జనసేన పార్టీలను, నిరంకుశ వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో ప్రజావాణి వినిపించేలా ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పేదల కష్టాలు తీర్చడమే సిపిఎం లక్ష్యమని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో సిపిఎం మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకరరావు, సిపిఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారాన్ని సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, ఈమని రామారావు జెండా ఊపి ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. జొన్నా శివశంకరరావు గతంలో 20 సంవత్సరాలు ఉండవల్లి సర్పంచ్‌గా పని చేసి ఉండడంతో ప్రతిచోటా ఆయనను అభిమానించే కుటుంబాలు ముందుకొచ్చి ఆశీర్వదించాయి. హారతులు పట్టాయి. ఈ సందర్భంగా ఉండవల్లిలో అభ్యర్థులు మాట్లాడుతూ.. మోడీ హటావో దేశ్ బచావో అనే పిలుపు ఊరూవాడా మారు మోగాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన బహిరంగ సభలో మోడీ చేసిన విద్వేష ప్రసంగం రాజ్యాంగ విరుద్ధమన్నారు. జగన్ ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో ఇబ్బడిముబ్బడిగా విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. కార్పొరేషన్‌లో పన్నుల భారం కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలపై మోపారని విమర్శించారు. వైసిపి, టిడిపి, జనసేనకు ఓట్లు వేస్తే బిజెపికి వేసినట్లేనని తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ 25వ డివిజన్ పరిధిలోని అరండల్‌పేట, కూర్మయ్య వంతెన సెంటర్ ప్రాంతాల్లో సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి సిహెచ్.బాబూరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలు గడిచినా సంజీవయ్య కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. విజయవాడ నగరంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. బాబూరావు సతీమణి చిగురుపాటి సునంద... సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని బిబి గూడెం, చిక్కవరం, గొల్లనపల్లి, గోపవరపు గూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, వియన్.పురం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. నెల్లూరు 9వ డివిజన్ పరిధిలోని బంగ్లాతోట, యనమల పాలెం, అల్లీపురం రోడ్డు, మైపాడు గేటు తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ మాట్లాడుతూ.. మరోసారి బిజెపి అధికారంలో వస్తే దళితులు, ముస్లిం, క్రైస్తవుల మనుగడ ప్రశ్నార్థకంగా ఉంటుందని వివరించారు. బిజెపితో అంటకాగుతున్న టిడిపి, జనసేన, వైసిపిని ఓడించాలని కోరారు. పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా కల్లూరు పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో పాణ్యం నియోజకవర్గం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ ప్రచారం నిర్వహించారు. సమస్యలను గాలికి వదిలేసిన పాలకులను ఎన్నికల్లో గాలికి వదిలేయాలని, తనను ఆదరిస్తే సేవకుడినై పనిచేస్తానని తెలిపారు. గౌస్‌దేశాయ్ విజయాన్ని కాంక్షిస్తూ కల్లూరు అర్బన్ పరిధిలోని 32వ వార్డు ముజఫర్ నగర్, 35వ వార్డు చింతలముని నగర్‌లో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలో కురుపాం నియోజకవర్గం అభ్యర్థి మండంగి రమణ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి ఓటును అభ్యర్థించారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో ఉపాధి కార్మికులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎంను గెలిపించాలని కోరారు. విశాఖలోని 76వ వార్డు పరిధిలోని డెయిరీ కాలనీ, హెచ్‌బి.కాలనీ, నడుపూరు, గంట్యాడ, వడ్లపూడి కాలనీల్లోనూ, 72వ వార్డు శ్రీనగర్‌లోనూ గాజువాక నియోజకవర్గం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ, జి.మాడుగుల, జికె.వీధి మండలాల్లో అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేశారు. రంపచోడవరం మండలంలోని వాడపల్లి, చిన్న బారంగి, పెద్ద బారంగి, ముసురుమిల్లి, తాటివాడ గ్రామాల్లో అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావును గెలిపించాలని కోరుతూ సిపిఎం బృందాలు ప్రచారం చేపట్టాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్ ఫలితాల్లో నారాయణ రికార్డ్

**ప్రజాశక్తి - హైదరాబాద్**

జెఇఇ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు చరిత్రను సృష్టించారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, శరణి నారాయణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఒకటి, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, పది, 12 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. పదిలోపు ఆరు, 12లోపు ఏడు ర్యాంకులతో నారాయణ విద్యాసంస్థ ప్రభంజనం సృష్టించిందని పేర్కొన్నారు. వందలోపు 28, వెయ్యిలోపు 171 ఓపెన్ కేటగిరీ ర్యాంకులతో ఆలిండియా లీడర్‌గా నారాయణ నిలిచిందని తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో జి నీల్‌కృష్ణ ఒకటో ర్యాంకు, హెచ్ విదిత్ ఐదో ర్యాంకు, ఎం అనూప్ ఆరో ర్యాంకు, ఎం సాయితేజ ఏడో ర్యాంకు, సిహెచ్ సతీష్‌కుమార్ ఎనిమిదో ర్యాంకు, ఆర్యన్ ప్రకాష్ పదో ర్యాంకు, పి రోహన్ సాయి 12వ ర్యాంకు కైవసం చేసుకున్నారని వివరించారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారని పేర్కొన్నారు. అనితర సాధ్యమైన శిక్షణ, పరిశోధనాత్మకమైన కార్యక్రమాలు, పటిష్ట ప్రణాళిక, స్టడీ మెటీరియల్, నిబద్ధతతో కూడిన వారాంతపు పరీక్షల వల్లే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అందుకు సహకరించిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని వారు అభినందించారు. తమ విదా సంస్థకు చెందిన అత్యధిక విద్యార్థులు జెఇఇ మెయిన్‌కు క్వాలిఫై కావడం గర్వంగా ఉందన్నారు.

## విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదు

- రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యలను ఖండించిన సిపిఎం

**ప్రజాశక్తి - అనకాపల్లి**

అనకాపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ చేసిన విద్వేషపూరిత ప్రసంగంపై సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో వారి ప్రభుత్వం వద్ద ఉన్న అభివృద్ధి ప్రణాళికలు, అజెండాలను వెల్లడించకుండా ఆర్టికల్ 370 రద్దు, రామమందిరం గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఉపసంహరణ ప్రకటన, సొంత గనులు కేటాయింపు వంటి ప్రాధాన్యత అంశాలను విస్మరించి అధికారంలోకి వస్తే ఒకే దేశం - ఒకే ఎలక్షన్ అమలు చేస్తామని చెప్పడం ప్రజాస్వామిక హక్కులను, విలువలను దెబ్బతియ్యడమే అవుతుందని తెలిపారు. పేదరికం, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుండా రామమందిరం నిర్మాణాన్ని విజయంగా చెప్పుకోవడం బాధ్యతా రహితమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రసంగాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడానికి పథకం ప్రకారం బిజెపి వ్యవహరిస్తోందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. జిల్లాకు వలస వచ్చి పచ్చని పల్లెల్లో విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్న వలసపక్షి సిఎం రమేష్‌ను ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ వివిధ రూపాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న కూటమి ఎంపి అభ్యర్థి రమేష్‌పై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జెఇఇ మెయిన్స్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-గుంటూరు**

జెఇఇ మెయిన్స్-2024 ఫలితాల్లో భాష్యం విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆయా విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా చంద్ర మౌళీ నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో గురువారం ఆయనతో పాటు డైరెక్టర్ హనుమంతరావు ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగిన జెఇఇ మెయిన్ పరీక్షల్లో భాష్యం విద్యార్థి ఎం జిష్ణుసాయి ఆలిండియా టాప్ మార్కు 300కి 300 మార్కులు సాధించి వంద పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకు సాధించారన్నారు. ఎం సాయి యశ్వంత్‌రెడ్డి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 36వ ర్యాంకు, ఇడబ్ల్యుఎస్ విభాగంలో ఆలిండియా 4వ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. వివిధ కేటగిరీలలో డి భరత్‌చంద్ర ఆలిండియా 20వ ర్యాంకు, కెజె వివేక్ 33వ ర్యాంకు, జి.జాన్ ఆలిండియా 49వ ర్యాంకు, కె.హర్షిత ఆలిండియా 50వ ర్యాంకు, పి శ్యామ్ ఆలిండియా 62వ ర్యాంకు, జె మణిప్రదీప్ ఆలిండియా 69వ ర్యాంకు, కె చైతన్య ఆలిండియా 77వ ర్యాంకు, ఎ గణేష్‌దత్తా ఆలిండియా 78వ ర్యాంకు, కె శ్రేయ ఆలిండియా 82వ ర్యాంకు సాధించారని వివరించారు. 100 ర్యాంకులోపు అత్యుత్తమ ర్యాంకులోపాటు ఆలిండియా 200లోపు 25 ర్యాంకు లు, 500లోపు 54 ర్యాంకులు, వెయ్యిలోపు 78 ర్యాంకులు కైవసం చేసుకొని 71.68 శాతం సక్సెస్ రేట్‌తో తమ సత్తా చాటారన్నారు. గత సంవత్సరం జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో భాష్యం విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 5, 10వ ర్యాంకులను సాధించారని, అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం మే నెలలో జరగబోయే జెఇఇ అడ్వాన్స్‌లో కూడా తమ విద్యార్థులు ఘన విజయాలు సాధించబోతున్నారని చెప్పారు.

## జెఇఇ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య చరిత్ర

**ప్రజాశక్తి - హైదరాబాద్**

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సంచలన రికార్డు సృష్టించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు 300కి 300 మార్కులతో ఆలిండియా ఒకటి, మూడు, ఆరు, తొమ్మిది ర్యాంకులను సాధించారని వివరించారు. ఓపెన్ కేటగిరీలో వందలోపు 25 ర్యాంకులు, 200లోపు 46 ర్యాంకులు, వెయ్యిలోపు 200 ర్యాంకులను కైవసం చేసుకున్నారని చెప్పారు. 300కి 300 మార్కులు సాధించి కెసి బసవ రెడ్డి ఆలిండియా ఒకటో ర్యాంకు, తోటంశెట్టి నిఖిలేష్ మూడో ర్యాంకు, హిమాన్ష తలార్ ఆరో ర్యాంకు, రెడ్డి అనిల్ తొమ్మిదో ర్యాంకు పొందారని అన్నారు. టాప్ పదిలోపు నాలుగు ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని చెప్పారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో వంద పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు 272 మంది ఉన్నారని వివరించారు. ఈ ఘనత సాధించిన విద్యాసంస్థ శ్రీచైతన్య మాత్రమేనని అన్నారు. ఇందుకు కారణమైన విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు. జెఇఇ అడ్వాన్స్‌డ్, నీట్ పోటీ పరీక్షల్లోనూ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో నెంబర్‌వన్ ర్యాంకులను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనితర సాధ్యమైన ప్రోగ్రాములు, మైక్రో షెడ్యూళ్లు, ఇంటర్నల్ పరీక్షలు, ర్యాంకింగ్ విధానం, ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్‌తో పాటు నిరంతరం శ్రమించే అధ్యాపకుల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు.

## బిజెపి గెలిస్తే ప్రతి రాష్ట్రం మరో మణిపూర్

**ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, తణుకు రూరల్**

రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటు వేస్తే ప్రతి రాష్ట్రం మరో మణిపూర్‌లా మండిపోతుందని ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. 'సంక్షోభంలో భారత్- ఆర్థిక రాజకీయ మూలాలు' అనే సదస్సును పశ్చిమగోదావరి జిల్లా తణుకులో, 'భారతదేశం వెలిగిపోతుందా?' అనే సదస్సును ఏలూరులో నిర్వహించారు. ఈ రెండు సదస్సులు ఐలు, జెవివి, తదితర సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఏలూరులో ఆంధ్రప్రదేశ్ పౌరసంఘాలు ప్రచురించిన 'పదేళ్ల నయవంచన' పుస్తకాన్ని పరకాల ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధరల పెరుగుదల, పెట్రోల్ రేట్లు పెరుగుదల, కరోనా సమయంలో మందుల కొరత, డాలర్ రేటు పెరుగుదల వంటి అంశాల్లో ఎంతో బాధపడి, తర్వాత వాటిని వదిలేశామని, అలా వదిలేసినంత కాలం పాలకులు మోసం చేస్తూనే ఉంటారని చెప్పారు. ఉపాధి అవకాశాలు లేక ప్రతి లక్షలాది మంది దేశం విడిచి వెళ్లిపోతున్నారన్నారు. గత రెండు సంవత్సరాల్లో

ఏలూరు సదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

దొంగతనంగా భారతదేశం నుంచి అమెరికా వెళ్లడానికి ప్రయత్నించిన వారిలో 93 వేల మందిని ఇమిగ్రేషన్ అధికారులు పట్టుకున్నారని, వారిలో గుజరాత్‌కు చెందిన వారే మూడు వేలమంది ఉన్నారని తెలిపారు. చదువుకున్న వారిలో 63 శాతం మంది నిరుద్యోగులు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని అన్నారు. పది సంవత్సరాల క్రితం 30 శాతం ఉన్న ప్రయివేటు పెట్టుబడులు నేడు 19 శాతానికి పడిపోయాయని, ఈ ప్రభుత్వ విధానాల వల్లే పెట్టుబడులు పెట్టేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు. ఎలక్టోరల్ బాండ్ల కోసమే కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తున్నారని తెలిపారు. పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతినే ఆహ్వానించలేదంటే ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతులు ఉద్యమాలు చేస్తుంటే వారిని దేశ ద్రోహులుగా చిత్రించి, స్వాతంత్ర పోరాటంలో పాల్గొనని వారిని నేడు దేశ భక్తులుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. మత ప్రాతిపదికన దేశాన్ని నిర్మించాలని చూస్తున్నారని, చదువుకున్న మేధావులు సైతం హిందువులకు ప్రత్యేకంగా దేశం ఉంటే తప్పేంటని అడుగుతున్నారని, సమాజంలో అంత విషాన్ని నాటారని, మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే మున్ముందు ఇక ఎన్నికలు ఉండవని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని రానున్న ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో ప్రజలే ఆలోచించుకోవాలని కోరారు. ఏలూరులో సదస్సుకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎన్.రమేష్ అధ్యక్షత వహించారు.

## సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలి

- కేంద్ర మాజీ మంత్రి వై కిషోర్‌చంద్రదేవ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న బిజెపికి వ్యతిరేకంగా సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్‌చంద్రదేవ్ ప్రజలను కోరారు. ఈ మేరకు అరకు పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న పాచిపెంట అప్పలనర్స, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న లోతా రామారావు, కురుపాం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న మండంగి రమణను గెలిపించాలని ఓటర్లను కోరుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

గిరిజనులకు నష్టం చేసే ఫారెస్ట్ చట్టసవరణను తీసుకొచ్చిన బిజెపిని ఓడించాలని కోరారు. బిజెపి నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీసంరక్షణ సవరణ చట్టం-2023 చాలా ప్రమాదకరమైనదని పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం, పెసా చట్టం, 1/70 తదితర చట్టాల కింద ఇప్పటివరకు గిరిజనులు సాధించుకున్న హక్కులన్నింటినీ కాలరాసేలా ఈ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు. తద్వారా గిరిజనుల జీవితాలను, పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టారని అన్నారు. ఈ నేపథ్యంలో బిజెపిని ఓడించాలంటే సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించడం అనివార్యం, అవసరమని పేర్కొన్నారు.

## ఎపి పేపర్ మిల్లు లాకౌట్ ఎత్తివేత

- నేటి నుంచి యథావిధిగా కార్యకలాపాలు
- కలెక్టర్ చొరవతో ఫలించిన చర్చలు
- ఇది కార్మికుల విజయం: సిఐటియు

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

ఎపి పేపరు మిల్లు లాకౌట్‌ను ఎత్తివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు గురువారం నోటీసు బోర్డు ఏర్పాటు చేసింది. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఎ-షిఫ్టు కార్మికులు యథావిధిగా విధులకు హాజరు కావాలని ప్రకటనలో పేర్కొంది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన జిల్లా ఎస్‌పి, జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యం, మిల్లులోని మొత్తం 11 కార్మిక సంఘాలతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం చర్చలు జరిగాయి. సుమారు 2 గంటలపాటు జరిగిన ఈ చర్చల్లో కార్మిక సంఘాలు అనేక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. వీటిపై వారు సానుకూలంగా స్పందించారు. యాజమాన్యంతో జరిపిన చర్చల్లో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. కార్మికులు విధులకు హాజరైన 25 రోజుల్లో వేతన ఒప్పందంపై చర్చలు జరుపుతామని యాజమాన్యం తెలిపింది. ఎపి పేపర్ మిల్లు యాజమాన్యం చివరి సారిగా 2017లో కార్మికులతో వేతన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పంద కాలం 2020 జూన్‌తో ముగిసింది. గతంలో జరిగిన చర్చల్లో 2020-2023 మధ్య కాలానికి వేతన ఒప్పందం చేయబోమంటూ మొండికేసిన యాజమాన్యం ఎట్టకేలకు దిగొచ్చింది. జిల్లా కలెక్టర్ సమక్షంలో 2020-2023 కాలానికి వేతన ఒప్పందం కోసం రాత పూర్వక హామీ ఇచ్చింది. సమ్మె కాలంలో కార్మికులపై ఎలాంటి కక్ష పూరిత చర్యలు చేపట్టబోమని పేర్కొంది.

**ఫలించిన ఐక్య పోరాటం : సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి. అరుణ్**

వేతన ఒప్పందం కోసం కార్మిక సంఘాలు ఐక్యంగా చేసిన పోరాటం ఫలించింది. గత 23 రోజులుగా కార్మికులు ఐక్యంగా సమ్మె చేపట్టారు. ఇది కార్మికుల విజయం. 2020-2023 మధ్య కాలంలోని వేతన ఒప్పందం చేసేందుకు యాజమాన్యం రాత పూర్వక హామీ ఇచ్చింది. కార్మికులకు మద్దతు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు. యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరోసారి కార్మిక పోరాటం తప్పదని హెచ్చరించారు.

## రూ.165.91 కోట్లు స్వాధీనం: సిఇఒ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.165.91 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువులు (తాయిలాలు) స్వాధీనం చేసుకున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ప్రకటించారు. ఓటర్లను ప్రలోభపర్చే వివిధ అంశాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణాపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు, రాష్ట్ర పరిధిలో వివిధ శాఖల ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటుచేశామని వివరించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం విలువలో రూ.36.89 కోట్ల నగదు, రూ.20.32 కోట్ల విలువైన 6.62 లక్షల లీటర్ల మద్యం, రూ.91.26 కోట్ల విలువైన వస్తువులు, రూ.2.78 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.14 కోట్ల విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## విశాఖ స్టీల్‌కు బొగ్గు కొరత రానీయొద్దు : హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

గంగవరం పోర్టు కార్మికుల సమ్మె వల్ల బొగ్గు సరఫరా కొరత వచ్చి విశాఖ స్టీల్ కర్మాగారం మూతపడే దుస్థితి రావడం శోచనీయమని హైకోర్టు వ్యాఖ్యానించింది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని కూడా వ్యాఖ్యానించింది. తక్షణమే కార్మికుల సమ్మె పరిష్కారానికి సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకోవాలంది. గంగవరం పోర్టులోని బొగ్గు నిల్వల ఓడలను మళ్లించాలని విశాఖ పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించింది. దీనిపై పూర్తి వివరాలు అందజేయాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విశాఖ పోలీస్ కమిషనర్‌లను ప్రతివాదులుగా చేర్చాలని హైకోర్టు రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణను శుక్రవారం కొనసాగిస్తామని ప్రకటించింది. బొగ్గు సరఫరాలో అంతరాయం లేకుండా చేసి విశాఖ స్టీల్స్ మూత పడకుండా చేయాలంటూ విశాఖ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె వెంకట దుర్గాప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నైనాల జయసూర్య గురువారం విచారణ జరిపారు. పోర్టులో కార్మికుల సమ్మె వల్ల విశాఖ ఉక్కులో బొగ్గు లేక స్టీల్ ప్లాంటులోని మూడు ఫర్నేజుల్లో ఒకటే పనిచేస్తోందని పిటిషనరు తరపున న్యాయవాది అంబటి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రెండు ఫర్నేజ్లు దెబ్బతిన్నాయని, రిపేరు చేయాలంటే కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అన్నారు. బొగ్గు నిల్వలు లేకపోతే విశాఖ ఉక్కు మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్టీల్ ప్లాంట్ సిఎమ్‌డి లేఖ రాశారని వివరించారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని, పోర్టు యాజమాన్యం, కార్మికులకు మధ్య గతంలోని ఒప్పందాన్ని పోర్టు మేనేజ్‌మెంటు అమలు చేయాల్సి వుందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు పోర్టుకు చెప్పారన్నారు. పోర్టు తరపున సీనియర్ న్యాయవాది వైవి రవిప్రసాద్ వాదిస్తూ, అమలు చేయలేని డిమాండ్లు పెడుతున్నారని, పోర్టు కోసం భూమి సేకరించిన ఫలితంగా నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ కింద ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

## మినీ వర్కర్లకు వేసవి సెలవులివ్వాలి

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

అంగన్‌వాడీ మినీ వర్కర్లకు వేసవి సెలవులివ్వాలని, అంగన్‌వాడీ సమ్మె విరమణ సందర్భంగా అంగీకరించిన వివిధ అంశాలకు సంబంధించి జిఓలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శిశు, సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు రిటైర్‌మెంటు బెనిఫిట్ కింద మొదటి వర్కర్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు, హెల్పర్లకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు పెంచుతూ జిఓ 47 ఇచ్చారని, అయితే దీనిని మార్చుతూ నగదు పరిమాణం పెంచి జిఓ ఇవ్వాలని ఆమె కోరారు. అలాగే అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలన్నారు.

## టిడిపి ప్రధాన కార్యదర్శిగా పనబాక లక్ష్మి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

టిడిపి ప్రధాన కార్యదర్శిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి నియమితులయ్యారు. బాపట్ల పార్లమెంటు అధ్యక్షులుగా సలగల రాజశేఖర్‌బాబును నియమించారు. ఈ మేరకు మరో 23 మందిని రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటూ ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## నయవంచక మోడీని ఓడించాల్సిందే

• నయవంచన పదేళ్ల నిరంకుశ పాలన పుస్తకావిష్కరణలో వడ్డే శోభనాద్రీశ్వరరావు

9



PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 261 | విజయవాడ, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 26 April 2024 | Rs


## నేడు రెండో దశ సార్వత్రిక సమరం

• 13 రాష్ట్రాల్లో 89 స్థానాలకు ఎన్నికలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల సమరంలో రెండో దశకు రంగం సిద్ధమైంది. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 89 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరుగనుంది. కేరళలోని మొత్తం 20 స్థానాలకూ ఒకే దశలో పోలింగ్ జరుగుతుంది. రెండో దశ పోలింగ్‌తో మణిపూర్, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాలలో ఎన్నికలు ముగుస్తాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోని 16 స్థానాలకు ఈ దశలోనే ఎన్నికలు జరుగుతాయి. అసోంలో 5 (మొత్తం స్థానాలు 14), బీహార్‌లో 5 (40), ఛత్తీస్‌గఢ్‌లో 3 (11), కర్నాటకలో 14 (28), కేరళలో 20 (20), మధ్యప్రదేశ్‌లో 7 (29), మహారాష్ట్రలో 8 (48), మణిపూర్‌లో 1 (2), రాజస్థాన్‌లో 13 (25), త్రిపురలో 1 (2), ఉత్తరప్రదేశ్‌లో 8 (80), పశ్చిమ బెంగాల్‌లో 3 (42), జమ్ముకాశ్మీర్‌లో 1 (5) స్థానానికి పోలింగ్ జరుగనుంది.

# ముగిసిన నామినేషన్ల ఘట్టం

• 175 అసెంబ్లీ స్థానాలకు 5,894 నామినేషన్లు
• 25 పార్లమెంట్ నియోజవర్గాలకు 1,077
• నేడు పరిశీలన • ఉపసంహరణలకు గడువు 29

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నామినేషన్ల పర్వం ముగిసింది. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఎనిమిది రోజులపాటు కొనసాగింది. రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎంతో సహా మరికొన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఇండిపెండెంట్లు పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు ఒకరిపై ఒకరు పోటాపోటీగా, కోలాహలంగా, జనసమీకరణల మధ్య నామినేషన్లు వేశారు. ఒక్కో అభ్యర్థి ఒకటి నుంచి మూడు సెట్ల వరకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల బంధువులతో పలు సెట్ల నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. రాష్ట్రంలోని 25 పార్లమెంట్ స్థానాలకు సంబంధించి మొత్తం 1,077 నామినేషన్‌లు దాఖలు కాగా, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు 5,894 నామినేషన్లు గురువారం రాత్రి 12.00 వరకూ ఎన్నికల అధికారులు అప్‌లోడ్ చేశారు. గురువారం వరకూ దాఖలైన మొత్తం నామినేషన్లను ఈ నెల 26న స్క్రూటినీ చేయనున్నారు. స్క్రూటినీ అనంతరం ఈ నెల 27 నుండి 29 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు వుంటుంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక, బరిలో వున్న అభ్యర్థుల తుదిజాబితాను అదే రోజు సాయంత్రం ఎన్నికల కమిషన్ విడుదల చేస్తుంది.

## మేడే పతాకావిష్కరణకు అనుమతి

• సిపిఎం వినతికి స్పందించిన ఎన్నికల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రచారం, ఎన్నికల ఉపన్యాసాలు లేకుండా మేడే రోజు పార్టీ ఆఫీసుల వద్ద, ఇతర చోట్ల జెండాలు ఆవిష్కరించడానికి, కార్మికులు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోడానికి ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. అయితే, వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించింది. పతాకావిష్కరణలకు అనుమతి ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం సిఇఓకు వినతిపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన సిఇఓ అనుమతి ఇస్తూ లేఖను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు పంపించారు. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, ఎన్నికల అధికారులకూ పంపించారు.

## మోడీ పాలనలో

# తాళిబొట్లూ కార్పొరేట్లకే!

• బ్యాంకులలో పెరుగుతున్న తాకట్లు • సంపద కోల్పోతున్న పేదలు

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచారంలో భాగంగా కొద్దిరోజుల క్రితం రాజస్థాన్‌లో పర్యటించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తాళిబొట్లను ప్రస్తావిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా చేసిన ప్రసంగంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే! మరోవైపు పదేళ్ల పాలనలో నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితంగా తాళిబొట్లు తాకట్టు రూపంలో బ్యాంకులకు, అక్కడి నుండి కార్పొరేట్ల ఖజానాలకు ఎలా చేరుతున్నది తాజాగా వెలుగులోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కూడా తమ కుమార్తెలకు వివాహ సందర్భంగా బంగారు తాళిబొట్టును ఇవ్వడాన్ని సెంటిమెంటుగా భావిస్తుంటారు. దానిని సమకూర్చడం కోసమే రెక్కలు ముక్కలు చేసుకునే తల్లితండ్రులూ పెద్దసంఖ్యలోనే ఉన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలు ఆ తాళిబొట్టుతో పాటు ఇళ్లలో ఉండే అరకొర బంగారాన్ని కూడా బ్యాంకుల్లో తాకట్టు పెట్టందే గడవని స్థితికి దేశంలోని అత్యధిక మంది నెట్టాయి. ఇలా తాకట్టు పెడుతున్న వారి సంఖ్య అధికారిక లెక్కల ప్రకారమే ప్రతిసంవత్సరం పెరుగుతూపోతోంది. ఒకసారి తాకట్టు పెట్టిన తరువాత చాలా కుటుంబాల్లో ఏం జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇలా దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదలు చెల్లించే వడ్డీ, విధిలేని పరిస్థితుల్లో తాకట్టు బంగారాన్ని వదులుకోవాల్సివస్తే వచ్చే ఆదాయంలో అధికమొత్తాన్ని బ్యాంకులు తిరిగి రుణాలుగా ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆ మొత్తంలో అధికభాగం కార్పొరేట్ల బొక్కసాలు నింపడానికే ప్రభుత్వం వినియోగిస్తోంది. ఇలా పేదల సంపద వారి చేతుల నుండి జారి ఇప్పుడే కార్పొరేట్ల పరమవుతోంది. ప్రధాని హోదాలో ఈ దుస్థితిని సరిదిద్ది, పేదలకు అండగా నిలవాల్సిన నరేంద్రమోడీ దానికి




భిన్నంగా వ్యవహరిస్తుండటం, ఒక మతంపై విషం చిమ్మడానికి ప్రయత్నించడం చర్చనీయాంశం గా మారింది.

**అధికారిక లెక్కల ప్రకారమే...**

రిజర్వు బ్యాంకు విడుదల చేసిన గణాంకాల ప్రకారమే బంగారాన్ని తాకట్టు పెడుతున్న వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. 2020 సెప్టెంబర్, 2021 సెప్టెంబర్ మధ్యకాలంలో బంగారు ఆభరణాలపై తీసుకున్న రుణాల సంఖ్య సుమారు 60 శాతం పెరిగింది. 2020వ సంవత్సరం సెప్టెంబర్ నెలలో 46,791 కోట్ల రూపాయలుగా ఉన్న బంగారు రుణాలు 2021 సెప్టెంబర్ నాటికి 63,770 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. 2022 సెప్టెంబర్ నాటికి ఈ మొత్తం 80,617 కోట్ల రూపాయలకు చేరింది. 2023 సంవత్సరాంతానికి దేశ వ్యాప్తంగా బంగారు రుణాలు లక్ష కోట్ల రూపాయలు దాటి ఉంటాయని అంచనా! గడిచిన మూడు, నాలుగు సంవత్సరాల్లోనే ఇంత పెద్దమొత్తంలో సాధారణ ప్రజల వద్ద ఉన్న బంగారానికి రెక్కలు వచ్చి బ్యాంకుల్లోకి చేరింది. ఆ తరువాత అది ఎక్కడకు చేరుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! రాజస్థాన్‌లో మతోన్మాద విషం చిమ్మిన నరేంద్రమోడీగానీ, కేంద్ర ప్రభుత్వం, బిజెపికి చెందిన ఇతర నాయకులు గానీ తరలుతున్న ఈ పేదల సంపద గురించి పెదవి విప్పడం లేదు.

**బ్యాంకుల వారీగా ఇలా...**

అన్ని బ్యాంకుల లావాదేవీల్లోనూ బంగారు రుణాల వాటా గణనీయంగా పెరుగుతోంది. 2020తో పోలిస్తే 2022 నాటికి ఎస్‌బిఐ ఇచ్చే బంగారు రుణాలు 21శాతం పెరిగాయి. బ్యాంకు ఆఫ్ బరోడాలో 27.8శాతం, హెచ్‌డిఎఫ్‌సిలో 16.3శాతం, యాక్సిస్ బ్యాంకులో 26శాతం బంగారు రుణాల్లో వృద్ధి చోటుచేసుకుంది. భవిష్యత్తులోనూ ఈ తరహా రుణాల కోసం వచ్చే వారి సంఖ్య భారీగా పెరగుతుందని బ్యాంకులు అంచనా వేస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా వ్యాపార విస్తరణ మిగతా 6లో

## 'ఉక్కు' ఆస్తులపై స్టే

• హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ స్టీల్‌ప్లాంటు ఆస్తులు, భూముల వ్యవహారంలో స్టేటస్‌కో (యథాతథస్థితి) కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వానికి ఎపి హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఉక్కు కర్మాగారానికి చెందిన ఒక్క ఎకరం విషయంలో కూడా అమ్మకాలు చేయబోమని కేంద్రం చెప్పడంపై స్పందించిన హైకోర్టు పైవిధంగా గురువారం ఆదేశాలు జారీ చేసింది. విశాఖ ఉక్కు ఆస్తులను అమ్మే ప్రతిపాదన లేదని, కేవలం వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణ వ్యవహారానికే తాము కట్టుబడి ఉన్నామని కేంద్రం చెప్పడాన్ని హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. విశాఖ ఉక్కు భూములు, ఆస్తులు ఇతర అంశాలపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేస్తూ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులిచ్చింది.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రిటైర్డ్ ఐపిఎస్ అధికారి వివి లక్ష్మీనారాయణ, కెఎ పాల్, సువర్ణరాజు ఇంకా పలువురు హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో దాఖలు చేసిన కౌంటర్‌లోని అంశాలతో తిరిగి కౌంటర్ దాఖలు చేసిందని రాష్ట్రం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ చెప్పారు. సిఎం జగన్ రాసిన లేఖ గురించి కౌంటర్‌లో ప్రస్తావన లేదన్నారు. కెఎ పాల్ జోక్యం చేసుకుని, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో గత పదేళ్లలో అనేక సంస్థలను అమ్మేసిందని, విశాఖ స్టీల్స్‌కు ఆ దుస్థితి ఏర్పడకుండా కాపాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ బి నరసింహ శర్మ కల్పించుకుని, సిఎం లేఖకు కేంద్ర ఆర్థికశాఖ 2021లో జవాబు ఇచ్చిందన్నారు.

## ఒకటో తేదీన ఇంటివద్దకే పింఛను

• సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

• లోపలి పేజీలో..•

## కేరళలో ఎల్‌డిఎఫ్‌కు ప్రజాదరణ!

• బిజెపి వ్యతిరేక విధానాలు, యుడిఎఫ్ వైఫల్యాలే ప్రచారాస్త్రాలు
• నేడు అన్ని ఎంపి స్థానాల్లో పోలింగ్‌కు సమాయత్తం

## మోడీ పేరు ప్రస్తావించకుండానే

# జెపి నడ్డాకు ఇసి నోటీసులు

• రాహుల్ విషయంలో ఖర్గేకు..
• 24 గంటల్లో సమాధానం ఇవ్వాలంటూ ఆదేశం

న్యూఢిల్లీ : ఇస్లామిక్ ఫోబియోతో ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై ప్రపంచ వ్యాపితంగా విమర్శలు వెల్లువెత్తడం, దేశంలో ప్రతిపక్షాలు పదే పదే లేఖలు రాసిన మీదట కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు స్పందించింది. అయితే ,నేరుగా మోడీకి నోటీసులు పంపడానికి బదులు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు కోడ్ ఉల్లంఘనపై గురువారం నోటీసులు ఇచ్చింది. అందులో మోడీ పేరు ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. శక్తివంతమైన నాయకులు కోడ్ ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం చాలా నెమ్మదిగా స్పందించడమే గాక, సుతిమెత్తగా హితవు పలికింది. మోడీకి కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయలేకపోయింది. మోడీకి కాకుండా పార్టీ అధ్యక్షుడికి నోటీసులు పంపడమేమిటని ప్రశ్నిస్తే, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 77ను ఉటంకిస్తూ పార్టీ స్టార్ క్యాంపెయినర్లను నియంత్రించడానికి మొదటిదశగా పార్టీ అధ్యక్షులను బాధ్యులు చేస్తూ ఈ నోటీసులు జారీ చేసినట్లు ఇసి తెలిపింది. నడ్డాకు పంపిన ఆ నోటీసులో ఇసి ఇలా పేర్కొంది. 'స్టార్ క్యాంపెయినర్లు అఖిల భారత దృష్టితో ఉత్తమ ఉపన్యాసాలు చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే ఈ ప్రయత్నాల్లో వారు అధికోత్సాహంతో నిబంధనలు దాటినప్పుడు, స్టార్ క్యాంపెయినర్లపై దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి' అని సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర ఎన్. బుటోలియా నడ్డాకు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు.

స్టార్ క్యాంపెయినర్లు చేసే ప్రసంగాలను తప్పనిసరిగా పర్యవేక్షించాలని నోటీసుల్లో తెలిపారు. స్టార్ క్యాంపెయినర్లను ఎంపిక చేసే, రద్దు చేసే అధికారం ఉన్న ఆయా పార్టీల అధ్యక్షులే స్టార్ క్యాంపెయినర్లు చేసిన ప్రసంగాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇసి ఆ నోటీసుల్లో తెలిపింది. శుక్రవారం ఉదయం 11 గంటల్లోపు సమాధానం చెప్పాలని నడ్డాను ఆదేశించింది.

**రాహుల్ ప్రసంగంపై ఖర్గే**

బిజెపి నడ్డాకు జారీ చేసిన నోటీసులనే కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేకు కూడా ఇసి జారీ చేసింది. తమిళనాడులోని కోయంబత్తూరులో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీపై దుష్ప్రచారం చేశారని, అలాగే, ఇటీవల ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బిజెపి నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు ఖర్గేకు ఇసి నోటీసులు జారీ చేసింది. దళితుడ్ని కావడం వలనే తనను రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదని, బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఖర్గే చెబుతున్నారని బిజెపి ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై ఖర్గేకు నోటీసులు జారీ చేసిన ఇసి రేపు 11 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

ఈ నెల ప్రారంభంలో కంగనా రనౌత్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెట్టినందకు కాంగ్రెస్ నాయకురాలు సుప్రియాకు, మమతా బెనర్జీపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి ఎంపి దిలీప్ ఘోష్‌కు నేరుగా నోటీసులు జారీ చేసింది. దీనికి ముందు కూడా బిజెపిపై ఆరోపణలు చేసినందుకు ఆప్ నాయకురాలు అతిషికి, హేమామాలినిపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకుడు రణదీప్ సింగ్ సూర్జేవాలేకు ఇసి నేరుగా నోటీసులు జారీ చేయడం గమనార్హం.

## ముస్లిం రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం

• కేంద్ర మంత్రి, బిజెపి నేత పియూష్ గోయల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముస్లిం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం విజయవాడ చేరుకున్న మంత్రి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో ఉండవల్లి నివాసంలో గంటకుపైగా చర్చించారు. ప్రస్తుతం ఎన్నికల తీరు, ప్రచారం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, మోడీ పర్యటనకు సంబంధించిన అంశాలపైనా చర్చించారు. అనంతరం విజయవాడలోని ఓ హోటల్లో గోయల్ మీడియాతో మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లను తాము వ్యతిరేకిస్తున్నామని, మార్పులు చేర్పులు చేసేందుకు ఇదే తమకు తగిన సమయమని ప్రకటించారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని, ఎపి వెనుకబడిందని, రైతులను పట్టించుకోవడం మానేశారని తెలిపారు. ఇసుక, ల్యాండ్, లిక్కర్ మాఫియాలకు కేంద్రంగా ఎపి మారిందని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం భూమిని ఇవ్వలేదని పేర్కొన్నారు. జిడిపిలో దేశం ఐదోస్థానానికి చేరుకుందని, మోడీ ఇచ్చిన హామీలను మర్చిపోలేదని, రామమందిర నిర్మాణం భారతీయులందరికీ గర్వకారణమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి గెలుపు ఖాయంగా కనిపిస్తోందన్నారు.

**టిడిపి ఏం చెబుతుంది?**

పియూష్ గోయల్ ప్రకటనతో టిడిపి గొంతులో వెలక్కాయపడింది. టిడిపి ముస్లిం రిజర్వేషన్ల విషయమై తమ వైఖరి ఏమిటన్నది ప్రజలకు స్పష్టపర్చవలసిన అవసరం ఏర్పడింది. ఒకే కూటమిలో వున్నా పార్టీలు పూర్తి విరుద్ధ వైఖరులు తీసుకుంటాయని చెబుతారా? లేక బిజెపి విధానమే తమదీ అని చెబుతారో చూడాలి. రాష్ట్రంలో మైనార్టీలు గణనీయమైన నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగే విధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన బిజెపి నేత ప్రకటన ఎన్‌డిఎ కూటమిలో ప్రధానంగా ఉన్న టిడిపికి మింగుడు పడని అంశంగా మారింది.

## అవినాష్ తప్పు చేయలేదని

# నమ్మి టికెట్ ఇచ్చా

• కూటమి కుట్రలకు సహకరించే వారా వైఎస్‌ఆర్ వారసులు?
• పులివెందుల సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్
• ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్



నామినేషన్ వేస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, పులివెందుల టౌన్/రూరల్

కడప వైసిపి అభ్యర్థి వైఎస్.అవినాష్‌రెడ్డి ఏ తప్పూ చేయలేదని నమ్మబట్టే టికెట్ ఇచ్చానని, మాలో అందరి కంటే చిన్నోడి జీవితం నాశనం చేయాలని చూడడం దారుణమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పులివెందుల సిఎస్‌ఐ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. జలయజ్ఞం, ఉచిత విద్యుత్, 108, 104, ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, ఇంగ్లీష్ మీడియం నాడు-నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రులు, చేయూత, ఆసరా, సురక్ష, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఇలాంటి సంక్షేమ పాలన గిట్టని పసుపు మూకలతో చెల్లెమ్మలు చేతులు కలపడం దుర్మార్గమని పేర్కొన్నారు. నోటాకు కూడా రాని ఓట్లు కలిగిన కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్‌ఆర్ వారసులమనే పేరుతో ముందుకు రావడం కుట్రలో భాగం కాదా? అని ప్రశ్నించారు. చనిపోయిన నాన్న పేరు సిబిఐ ఛార్జిషీట్‌లో చేర్చిందెవరో చెప్పాలని అన్నారు. వైఎస్‌ఆర్ పేరు చెరిపేసి ఆయన కుటుంబాన్ని అణగదొక్కాలని కుట్రలు పన్నిందెవరని నిలదీశారు. దేశంలోని అన్ని వ్యవస్థల్నీ ప్రయోగించిన కాంగ్రెస్, టిడిపిలతో కలవడం దారుణమని, వైఎస్‌ఆర్‌పై దాడి చేసిన వారితో కలిసి పసుపు చీర కట్టుకుని వారికి మోకరిల్లడం శోచనీయమని అన్నారు. తనపై బురద జల్లేందుకు ఎవరు పంపించారో, వారి వెనుక ఎవరు ఉన్నారో తెలుస్తోందన్నారు. చిన్నాన్న వివేకాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన వారితో కలిసి చెట్టాపట్టాలేసుకుని తిరగడమేమిటని ప్రశ్నించారు. 14 ఏళ్ల టిడిపి పాలనలో జగన్ కంటే మంచి చేశామని చెప్పగలరా? అని ప్రశ్నించారు. రూ.9,000 కోట్లతో జిఎన్‌ఎస్‌ఎస్-హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అనుసంధానంలో భాగంగా కాలేటివాగును పూర్తి చేశామన్నారు. గతంలో చిత్రావతిలో మూడు, నాలుగు టిఎంసిలు నిల్వ చేసేవారని, వైసిపి హయాంలో పది టిఎంసిలను, పైడిపాలెంలో ఆరు టిఎంసిలను నిల్వ చేశామని తెలిపారు. యురేనియం బాధిత గ్రామాలకు ఎర్రబల్లి పైప్‌లైన్ పనులు పరుగులు తీస్తున్నాయన్నారు. ఆగస్టు, జులై మాసాల్లో పులివెందులలో మెడికల్ కళాశాలను అంకితం చేస్తామని తెలిపారు. రూ.5,900 కోట్లతో పులివెందులలో మిగతా 6లో

# మోడీతో బాబు పొత్తు, జగన్ తొత్తు

• వారికి ఓటేస్తే డ్రెయినేజీలో వేసినట్లే
• ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి : వైఎస్.షర్మిల

విజయవాడ రాణిగారితోటలో జరిగిన సభలో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, విజయవాడ అర్బన్

వివేకా హత్య కేసులో నిందితుడైన వైఎస్.అవినాష్‌రెడ్డికి బెయిల్ కోసం ప్రధాని మోడీ కాళ్ల దగ్గర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోకరిల్లారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ప్రత్యేక హోదాతోపాటు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడూ ప్రధానిపై ఒత్తిడి తేలేని జగన్... అవినాష్‌రెడ్డిని రక్షించడానికి పదేపదే ప్రధానిని కలిశారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేసినా, జగన్‌కు ఓటేసినా డ్రెయినేజీలో వేసినట్లేనని అన్నారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో చేపట్టిన న్యాయయాత్రలో భాగంగా గురువారం ఆమె విజయవాడలోని కృష్ణలంక రాణిగారితోటలోనూ, గుంటూరు తూర్పు నియోజవర్గంలోని సంజీవయ్య నగర్‌లోనూ ఎన్నికల ప్రచార సభల్లో, సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగించారు. అవినాష్‌రెడ్డిని వెనకేసురావడం కోసం తనను, వివేకానందరెడ్డిని జగన్ కించిపరిచి మాట్లాడారన్నారు. పులివెందుల సభలో వైఎస్ వివేకా గురించి కనీసం నాలుగు మంచిమాటలు చెప్పకుండా ఆయనపై ఉన్న కక్ష బయటపెట్టారన్నారు. అవినాష్‌రెడ్డిని వెనకేసుకురావడానికి వివేకాను కించపర్చాలా? అని ప్రశ్నించారు. పసుపు చీర ధరిస్తే చంద్రబాబుతో తాను కలిసినట్టా? అని ప్రశ్నించారు. పసుపు రంగు టిడిపి సొంతమా? చంద్రబాబు పేటెంట్ రంగని ఎవరైనా చెప్పారా? సాక్షి పేపరులో బేనర్ హెడ్డింగ్‌లో పసుపు రంగు ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సాక్షి పేపరు బ్యానర్ తయారు చేసేటప్పుడు పసుపు మంగళకరం అని ఆయనే లోగో రూపొందించారని గుర్తు చేశారు. గత పదేళ్లుగా రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రధాని మోడీతో టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల పొత్తు పెట్టుకుంటే, సిఎం జగన్ ఐదేళ్లుగా మోడీకి తొత్తుగా వ్యవహరించారని, అయినా, రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టును కూడా తీసుకురాలేకపోయారని,ప్రత్యేక హోదా, మిగతా6లో

# రెండో దశ అభ్యర్థుల్లో ధనవంతులెవరంటే.?!

**రెండో దశ పోలింగ్ శుక్రవారం (ఏప్రిల్ 26) రోజున జరగనుంది. ఈ దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు, ఒక బిజెపి అభ్యర్థి అందరిలోకి అత్యధిక ధనవంతులుగా అగ్రస్థానంలో నిలిచారు. నామినేషన్లతోపాటు అభ్యర్థులు ఇసికి దాఖలు చేసిన అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) రూపొందించిన ఈ జాబితా ఆధారంగా 33 శాతం మంది కోటీశ్వరులుగా ఉన్నారు.**



**వెంకట రమణే గౌడ :** కర్ణాటక మండువ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీకి దిగారు. ఇతనికి రూ. 622 కోట్లకు పైగా ఆస్తులున్నాయి.

**డి.కె సురేష్ :** కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె శివకుమార్ సోదరుడు డికె సురేష్. బెంగళూరు రూరల్ స్థానం నుంచి పోటీకి దిగారు. ఆయన ఆస్తులు 593 కోట్ల రూపాయలు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలకు దాదాపు ఈయన ఆస్తులు 75 శాతం పెరిగాయి.

**హేమమాలిని :** ప్రముఖ బాలీవుడ్ నటి హేమామాలిని యుపి రాష్ట్రం మధుర సిట్టింగ్ ఎంపి. ఈమె ఈ స్థానం నుంచి రెండుసార్లు బిజెపి తరపున గెలిచారు. ఇప్పుడు వరుసగా మూడోసారి బరిలో నిలిచారు. ఈమెకు రూ. 278 కోట్ల ఆస్తులు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో హోషంగాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి

సంజయ్‌శర్మ రూ. 233 కోట్లు. కర్ణాటక స్టేట్ మాండ్యలో జెడిఎస్ ఛీఫ్ కుమారస్వామికి రూ. 217 కోట్లు. యూపీలో అమ్రోహా బిజెపి అభ్యర్థి కన్వర్ సింగ్ తన్వర్ రూ. 215 కోట్ల

# కేరళలో ఎల్‌డిఎఫ్‌కు ప్రజాదరణ!

**కేరళ ఓటర్లు శుక్రవారం (ఏప్రిల్ 26) తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో గెలుపుపై సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు అవకాశాలు పెరుగుతున్నాయి. గత 40 రోజులుగా ఉధృతంగా సాగిన ఎన్నికల ప్రచారానికి బుధవారం సాయంత్రంతో తెరపడింది. మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద పోకడలతో సహా వివిధ సమస్యలను తీవ్రంగా ప్రజల దృష్టికి తెస్తూ ఈ ప్రచారం సాగింది. ఎల్‌డిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే లౌకికవాదం, సమాఖ్యవాదం విలువలను పరిరక్షించుకోవాలన్న తమ ఆకాంక్ష నెరవేరగలదని ప్రజలు ఆశిస్తున్నారు.**

- బిజెపి వ్యతిరేక విధానాలు, యుడిఎఫ్ వైఫల్యాలే ప్రచారాస్త్రాలు
- నేడు అన్ని ఎంపి స్థానాల్లో పోలింగ్‌కు సమాయత్తం

**తిరువనంతపురం నుండి ఎన్.ఎస్ సజిత్**

వామపక్షాలే దేశానికి రక్ష

ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం , సిఎఎ, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాలపై వామపక్ష ఉద్యమాలు, పోరాటాలను ఎల్‌డిఎఫ్ తన ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించింది. 'వామపక్షాలు లేకపోతే భారతదేశం లేదు' అన్న ఎల్‌డిఎఫ్ నినాదం ఓటర్లను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ మాస్టర్, సిపిఎం అగ్రనేతలు ప్రకాష్ కరత్, బృందా కరత్, సుభాషిణి అలీతో పాటు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వంతో సహ పలువురు ప్రముఖ నేతలు ఎల్‌డిఎఫ్ తరపున ప్రచారం సాగించారు. పార్లమెంట్ లోపల, వెలుపల ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడేది వామపక్షాలు మాత్రమేనని నేతలు స్పష్టం చేశారు. సామాన్యుల వాణిని వినిపించడానికి కట్టుబడి వున్నది, అలాగే వ్యవసాయ మార్కెట్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, ఆహార ధాన్యాలు, ఎల్‌పిజి , ఇంధనాలు వంటి వాటితో సహా నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెగలిగేది కూడా వామపక్షాలేనని నేతలు ప్రజలకు వివరించారు.

**అనుభవజ్ఞులను దించిన ఎల్‌డిఎఫ్**

సిట్టింగ్ ఎంపి వి.కె.శ్రీకందన్‌పై పాలక్కాడ్ నియోజకవర్గం నుండి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్ భారీ విజయాన్ని నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు. పతనాంతిట్ట నియోజకవర్గంలో మూడుసార్లు ఎంపి అయిన ఆంటో ఆంటోనీకి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ థామస్ ఇజాక్ గట్టి పోటీనిస్తున్నారు. కాంగ్రెస్‌నేత ఎ.కె.ఆంటోనీ కుమారుడు అనీల్ ఆంటోనీ అక్కడ బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తుండడం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసింది. కేరళ ఆర్థిక మంత్రిగా ఇజాక్ పనితీరే ఆయనను గెలిపిస్తుందన్న విశ్వాసాన్ని ఎల్‌డిఎఫ్ వ్యక్తం చేస్తోంది. ఎల్‌డిఎఫ్‌కు గట్టి పట్టు వున్న అలతూర్ ఓటర్ల నుండి కేంద్ర కమిటీ సభ్యుడు, మంత్రి కె.రాధాకృష్ణన్‌కు మంచి స్పందన లభిస్తోంది. సిట్టింగ్ ఎంపి రమ్య హరిదాస్‌పై ఆయన పోటీ చేస్తున్నారు. పార్లమెంట్‌లో ఆమె పేలవమైన పనితీరు అందరికీ తెలిసినదే. కొజికోడ్‌లో కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు నేత ఎలమరం కరీమ్ మూడుసార్లు ఎంపి అయిన ఎం.కె.రాఘవన్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. ఇతర ఎల్‌డిఎఫ్ అభ్యర్థులు ఎం.వి.బాలకృష్ణన్ మాస్టర్ (కాసర్‌గోడ్), ఎం.వి.జయరాజన్ (కన్నూర్), అనీ రాజా (వాయనాడ్), వి.వసీఫ్ (మలప్పురం), కె.ఎస్.హంసా(పొన్నై), వి.ఎస్.సునీల్ కుమార్(త్రిస్సూర్), సి.రవీంద్రనాథ్(చలక్కుడి), కె.జె.షైన్(ఎర్నాకులం), జాయిస్ జార్జి(కొట్టాయం), థామస్ చజికడన్(కొట్టాయం), ఎ.ఎం.ఆరిఫ్(అలప్పుజ), సి.ఎ.అరుణ్‌కుమార్(మవెలిక్కర), ఎం.ముకేష్(కొల్లామ్), వి.జాయ్(అత్తింగళ్), పన్నియన్ రవీంద్రన్(తిరువనంతపురం) బరిలో వున్నారు.

## బిజెపిపై పోరులో యుడిఎఫ్ నిష్క్రియాపరత్వం

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తంగా 20 స్థానాలకు గానూ యుడిఎఫ్ 19 స్థానాలను కైవసం చేసుకుంది. ఈ ఎంపీల పేలవమైన పనితీరు ఎన్నికల్లో చర్చకు వచ్చింది. సిఎఎ, ఎన్ఐఎ బిల్లులపై, రైతుల ఆందోళన వంటి అంశాలపై మోడీ ప్రభుత్వ నిష్క్రియాపరత్వంపై ప్రతి సభలోనూ చర్చించారు. యుడిఎఫ్‌లో బలమైన భాగస్వామి ముస్లిం లీగ్‌ను అవమానపరిచారు. రాహుల్ గాంధీ పోటీ చేసే వాయనాడ్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వారి ఆకుపచ్చ జెండాలను తీసుకురావడం గానీ ఎగురవేయడం గానీ చేయరాదంటూ కాంగ్రెస్ ఆదేశాలు జారీ చేసింది. జెండాలు తీసుకువచ్చినందుకు ముస్లిం లీగ్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేయి కూడా చేసుకున్నారు. 2019లో రాహుల్ గాంధీ ర్యాలీల్లో ఆకుపచ్చ జెండాలు చూసి వాటిని పాకిస్తాన్ జాతీయ పతాకాలుగా తప్పుగా అర్థం చేసుకున్నారు.

## సోషల్ మీడియాలో జగుప్సాకర ప్రచారం

వడక్కర నుండి పోటీ చేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కె.కె.శైలజపై సెక్సీ వ్యాఖ్యలతో అత్యంత హేయమైన రీతిలో జరిగిన సైబర్ దాడి కాంగ్రెస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిగా రక్షణలో పడేసింది. సైబర్ వేదికగా యుడిఎఫ్ కార్యకర్తలు ఒక మహిళా నేతపై చేసిన దాడి అనూహ్యమైనది, గతంలో కనివినీ ఎరుగనిది. ఆరోగ్య మంత్రిగా పనిచేసే సమయంలో కోవిడ్, నిఫా వైరస్‌లను అత్యంత సమర్థవంతంగా, సాహసోపేతమైన రీతిలో ఎదుర్కోవడంలో శైలజ చూపిన నేర్పు, ప్రతిభ అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నాయి.. తనపై జరిగిన సైబర్ దాడిని ఖండించడానికి పెట్టిన పత్రికా సమావేశంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రత్యర్థి షఫి పరాంబిల్‌పై ఆమె కేసు కూడా పెట్టారు.

# కన్నౌజి నుంచి అఖిలేష్ యాదవ్ నామినేషన్

కన్నౌజి : ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజి స్థానం సమాజ్‌వాది పార్టీకి కంచుకోటగా నిలిచింది. ఈ స్థానం నుంచి ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ రిటర్నింగ్ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'కన్నౌజిలో ఎస్పీ చేసిన అభివృద్ధిని బిజెపి ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తుంది. అయితే ఎస్పీ చేసిన అభివృద్ధి ఏంటో కన్నౌజి ప్రజలకు తెలుసు'నని అఖిలేష్ అన్నారు. పార్టీ నేతల ఒత్తిడి మేరకే ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు ఆయన అన్నారు. కాగా, ఇక్కడి నుంచి గతంలో అఖిలేశ్ మేనల్లుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేయనున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. అయితే సమాజ్‌వాది పార్టీ కచ్చితంగా గెలిచే స్థానం కనుక ఆ స్థానంలో అఖిలేష్ మరోసారి బరిలోకి దిగారు.

## ఖలిస్తానీ వేర్పాటువాది లోక్‌సభ ఎన్నికల్లోపోటీ?

అస్సాం జైలులో ఉన్న ఖలిస్తానీ వేర్పాటువాది అమృతపాల్ సింగ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని వార్తలొస్తున్నాయి. ఈ ఎన్నికల్లో పంజాబ్ రాష్ట్రం ఖాదూర్ సాహిత్ స్థానం నుంచి అమృతపసాల్‌సింగ్ పోటీ చేసే అవకాశాలున్నాయని ఆయన తండ్రి తార్సేమ్ సింగ్ గురువారం చెప్పారు. మొదట్లో రాజకీయాల్లో ఆసక్తి లేకపోయినా.. బుధవారం న్యాయవాది రజ్‌దేవ్ సింగ్ ఖల్సా దిబ్రూగఢ్ జైలులో అమృతపాల్‌ని కలిసిన తర్వాత పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తార్సేమ్ సింగ్ అన్నారు. కాగా 'వారిస్ పంజాబ్ దే' సంస్థ చీఫ్ అమృతపాల్ సింగ్‌ను గతేడాది ఏప్రిల్ 23న పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద కేసు పెట్టారు.

# గుజరాత్‌లో అంత ఈజీ కాదు

- గత ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలిచిన బిజెపి
- కమలానికి దడ పుట్టిస్తున్న అంతర్గత పోరు, ఠాకూర్ల నిరసనలు
- గిరిజనుల ఆందోళనలు కూడా
- కాంగ్రెస్, ఆప్ అవగాహనతో 'ఇండియా' బలోపేతం
- రాహుల్ జోడో యాత్ర ప్రభావం

**ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా సొంత ఇలాకా గుజరాత్‌లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అన్ని సీట్లనూ తమ వశం చేసుకుంది. కాగా ఈ మారు పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. గతంలో మాదిరి బిజెపి గెలుపు నల్లేరుమీద నడక కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో కాంగ్రెస్, ఆప్, బిటిపిల మధ్య ఓట్లు చీలిపోవడంతో బిజెపి గెలుపు సులువైంది. ఈ ఎన్నికల్లో గుజరాత్‌లో ఇండియా బ్లాక్‌లో భాగంగా కాంగ్రెస్, ఆప్ కలసి బరిలోకి దిగడంతో బిజెపిలో వణుకు మొదలైంది. కొందరు బిజెపి అభ్యర్థులు పోటీ నుంచి విరమించుకున్నారు. అంతేకాదు, కుట్రలు పన్ని ప్రత్యర్థులను నామినేషన్ల సమయంలోనే తప్పించే ఎత్తులు వేసింది. అందుకు ప్రత్యక్ష ఉదారణ సూరత్‌లో బిజెపి అభ్యర్థి ఏకగ్రీవం. సర్పంచ్, వార్డు మెంబర్ వంటి వారి ఎన్నిక ఏకగ్రీవం కావడం కద్దు. ఒక ఎంపి స్థానంలో అభ్యర్థులందరి నామినేషన్లూ స్క్రూటినీలో పోయి ఒక్క బిజెపి అభ్యర్థిది మిగలడం, ఎన్నిక ఏకగ్రీవం కావడం గమనార్హం.**



26 స్థానాలకు మే 7న పోలింగ్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాలకు మూడోవిడతలో ఒకేసారి మే 7న పోలింగ్ జరగనుంది. ఎంపి ఎన్నికలతో పాటుగా ఐదు అసెంబ్లీ స్థానాలకూ అదే రోజున ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 22న నామినేషన్లు ముగిసేనాటికి మొత్తం 491 మంది లోక్‌సభకు, 39 మంది అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. ఇండియా కూటమి సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్ 24 స్థానాలోనూ, ఆప్ రెండు స్థానాలోనూ పోటీ చేస్తున్నాయి. భరూచ్, భవనగర్ అనే రెండు ఆప్ స్థానాల్లో చైతర్ వసావా, ఉమేష్ మక్వానాలు పోటీపడుతున్నారు.

**గిరిజన ఓట్లపై కాంగ్రెస్ దృష్టి**

గిరిజన ప్రాబల్యమెక్కువున్న భరూచ్ స్థానంలో కాంగ్రెస్‌కు పట్టు ఉండేది. కానీ, ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ గిరిజన నేతలు బిజెపిలోకి ఉడాయించారు. బిటిపి పార్టీ అధ్యక్షుడు మహేష్ వసావా బిజెపిలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో భరూచ్ నియోజకవర్గం పరిధిలోని డేడియాపాడా సీటును ఆప్ గెలుచుకుంది. కాబట్టి భరూచ్‌లో ఆప్ అభ్యర్థి పోటీ చేస్తున్నారు. రాహుల్ జోడో యాత్ర ఈ గిరిజన ప్రాంతాల గుండానే కొనసాగింది. బిజెపి అభ్యర్థి మన్‌సుక్‌భాయ్ వసావాకు ఆప్ చైతర్ వసావా గట్టి పోటీ ఇవ్వనున్నారు. కేజ్రివాల్ అరెస్టు అవ్వడంతో ఆయన సతీమణి సునీత, పంజాబ్ సిఎం భగవంత్ మాన్, ఆప్ కేంద్రమంత్రులు ఆపార్టీ తరుపున ప్రచారం చేస్తున్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 182 స్థానాల్లో ఆప్ 5, కాంగ్రెస్ 17, బిజెపి 156 స్థానాలను గెలుచుకున్నాయి. స్థానిక సంస్థల్లో ఓబీసిల 10 శాతం రిజర్వేషన్‌ను 27 శాతానికి బిజెపి క్యాబినెట్ పెంచింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం సీట్లను బిజెపి గెలుచుకోగా, బిజెపి 62.21 శాతం, కాంగ్రెస్ 32.11 శాతం ఓట్లు సాధించాయి.

**బిజెపికి నిరసనల సెగ**

బిజెపి ఐదు సిట్టింగ్‌లను మార్చింది. జునాగఢ్ స్థానంలో పార్టీ అభ్యర్థిని మార్చాలని అరడజను మంది నాయకులు రాష్ట్ర బిజెపి చీఫ్ సిఆర్ పాటిల్‌ను సోషల్‌మీడియా ద్వారా కోరారు. రంజన్ భట్ వడోదరా అభ్యర్థిని మార్చారు. రాజ్‌కోట్ అభ్యర్థి వ్యాఖ్యలతో రాజ్‌పుత్‌ల ఆగ్రహానికి గురయ్యారు. సబరికాంతలో బిజెపి అభ్యర్థిపై కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారు. కేంద్ర మంత్రి పురుషోత్తమ్ రూపాలా ఠాకూర్లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేడంతో రూపాలకు రాజ్‌కోట్ టిక్కెట్ ఇవ్వొద్దని ఠాకూర్లు నిరసనలు తెలుపుతున్నారు. అంతేకాదు, ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయొద్దని తీర్మానించారు. ఠాకూర్ల ఓట్లతో గెలుస్తున్న బిజెపికి ఈ పరిణామం మింగుడు పడట్లేదు. అమ్రేలీలో సిట్టింగ్ ఎంపి నారాన్ కచ్చదియా, కొత్త అభ్యర్థి భారత్ సుతారియిల మద్దతుదారులు బాహాటంగానే తలపడడంతో పార్టీలో అంతర్గత పోరు బయటపడింది. అర్హతను బట్టి కాకుండా కులం ప్రాతిపదికగా అభ్యర్థిత్వం ఖరారు చేస్తుండటంతో అభ్యర్థుల్లో అసంతృప్తి నెలకొంది. బిల్కిస్‌బానో కేసులో దోషులను విడుదల చేయడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. రాష్ట్ర జనాభాలో 38 శాతం పోషకాహార లేమితో బాధపడుతున్నట్లు నీతిఆయోగ్ వెల్లడించింది. పట్టణాలే తప్ప గ్రామాల అభివృద్ధి మరచింది. జింక్ స్మెల్టర్ ప్రాజెక్టు కోసం గిరిజనుల భూముల సేకరణపై వ్యతిరేకత కొనసాగుతోంది. ఇత్యాది ప్రతికూలాలు బిజెపిని వెంటాడుతున్నాయి.

**- ఎలక్షన్ డెస్క్**

# కలం బాణాలు

## రూ. 25 వేల కోట్ల అవకతవకల కేసులో సునేత్రా పవార్‌కు క్లీన్ చిట్

లెక్కేమున్నది మేడం
25 కె కోట్లే కద
మాతో జతకట్టినాక
వుండదులే తమకేరొద

వ్యతిరేకం అయినోళ్ళకె
పిఎంఎల్ఎ లాండ్రింగ్
మోడీకే జై కొట్టండిక
మీకే మిషన్ తొ వాషింగ్

## గ్లాస్ గుర్తును జనసేన అభ్యర్థులకే కేటాయించాలి : టిడిపి వినతి

గ్లాసు మాకె చెందాలని
ఎన్నిసార్లు మొరలు
ఢిల్లీ దాకా వెళ్లివెళ్ళి
నిరంతరం పైరవీలు

సీట్ల మాట దేవుడెరుగు
సింబలుకే యుద్ధమా?
మోడీతో మాట్లాడి
పవరే చూపిద్దమా?

## వారసత్వ పన్నుపై రాజకీయ దుమారం

సంపదలే ముస్లింలకు
ఇస్తారని మోడీ
పెట్టిన చిచ్చులు చాలక
మీరేమిటి పిట్రోడీ?

సామ్యవాద సమాజమా
పురాతనపు దేశం
పెట్టుబడుల ముట్టడిలో
ఎక్కడిదా అవకాశం?

**- తె.ర**

# 'ఉక్కు'ను కాపాడుకోవడమే లక్ష్యం

**సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు**

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

**'అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎంను గెలిపిస్తే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుంటాం. పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక అభివృద్ధికి కృషి చేస్తాం' అని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల బరిలో ఉన్న ఆయన పలు విషయాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు.**

**ప్రశ్న : ఏ అంశాలతో ఎన్నికల ప్రచారంలో ముందుకెళ్తున్నారు?**

**జవాబు :** లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత. కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి. పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరపాలి. సొంత గనులు కేటాయించాలి. ఉక్కు నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ కాలుష్యాన్ని నియంత్రించాలి. ఈ విషయాలపై ప్రధానంగా ప్రచారం చేస్తూ ముందుకెళ్తున్నాం.

**ప్ర : గాజువాకలో సిపిఎం చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు ఏమిటి?**

**జవాబు :** పేద ప్రజల ఇళ్ల పట్టాల కోసం పోరాటం చేశాం. ఫలితంగానే ప్రభుత్వాలు 296, 388 జిఒలను విడుదల చేశాయి. వీటివల్ల పేదలకు ఇళ్ల పట్టాలు వచ్చాయి. సిపిఎం భూ పోరాటాల ఫలితంగా పేదలకు లబ్ధి చేకూరింది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఒక్కశాతం వాటా కూడా అమ్మకుండా పోరాటాలతో అడ్డుకోగలిగాం.

**ప్ర : నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలేంటి?**

**జవాబు :** ఇక్కడ యువత నిరుద్యోగులుగా ఉన్నారు. గాజువాకలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. విఐపిజెడ్, అదానీ గంగవరం పోర్టు, ఆటోనగర్ ప్రాంతాల్లో కనీస వేతనాలు అమలు జరగడం లేదు. కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. ఇళ్లు లేని పేదలు వేలాది మంది ఉన్నారు. పన్నుల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మేం గెలిస్తే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

**ప్ర : ఓటర్లను ఏమని అభ్యర్థిస్తున్నారు?**

**జవాబు :** గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ కాలుష్య నియంత్రణకు, అగనంపూడి టోల్‌గేట్ సమస్య, రామచంద్రనగర్‌లో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి సిపిఎం కృషి చేస్తుందని ఓటర్లుకు వివరిస్తున్నాం. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తున్నాం. పోరాడే వారినే గెలిపించాలని కోరుతున్నాం.

# గిరిజన సమస్యలే అజెండా

- రాజ్యాంగ పరిరక్షణతోనే హక్కులు, చట్టాలకు రక్షణ
- 'ప్రజాశక్తి'తో కురుపాం సిపిఎం అభ్యర్థి మండంగి రమణ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

**ఎన్నికల్లో సిపిఎంను గెలిపిస్తే గిరిజన ప్రజల సమస్యలే అజెండాగా పనిచేస్తామని, కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఇండియా వేదిక బలపర్చిన పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి మండంగి రమణ తెలిపారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే గిరిజన ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికలు సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు.**

**ప్రశ్న : ఏయే అంశాలతో ప్రచారంలో ముందుకెళుతున్నారు?**

**జవాబు :** ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తేనే రాజ్యాంగాన్ని కాపాడుకోగలం. మోడీ పదేళ్ల పాలనలో రాజ్యాంగానికి రక్షణ కరువైంది. కులాలు, మతాలు పేరుతో ప్రజలను రెచ్చగొట్టి మతోన్మాదాన్ని బిజెపి పెంచి పోషిస్తుంది. చదువుకున్న యువతకు ఉద్యోగం, ఉపాధి లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాదు. ధరల పెరుగుదలతో బతుకు భారం అవుతుంది. హక్కులు, చట్టాలకు రక్షణ ఉండాలంటే, ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించాలంటే బిజెపిని ఓడించాలని ప్రజలను కోరుతున్నాం.

**ప్ర : కురుపాం నియోజకవర్గంలో సిపిఎం చేసిన పోరాటాలు ఏమిటి?**

**జవాబు:** రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కురుపాం నియోజకవర్గంలో సిపిఎం తోటపల్లి నిర్వాసితుల పక్షాన పోరాటం చేసి మెరుగైన నష్ట పరిహారం సాధించింది. గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, భద్రగిరిలో పోస్టుమార్టం విభాగం వంటివి సిపిఎం పోరాట ఫలితంగానే వచ్చాయి. మరోవైపు పూర్ణపాడు-లాబేసు, గుమ్మిడి గెడ్డ రిజర్వాయర్, గిరిజన యూనివర్సిటీ, జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ వంటి వాటికోసం ప్రజల పక్షాన ఉంటూ సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంది.

**ప్ర : ప్రజలను, ఓటర్లను ఏమని అభ్యర్థించదలిచారు?**

**జవాబు:** గత టిడిపి, నేటి వైసిపి పాలనలో నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు నేటికీ మెరుగుపడలేదు. ప్రజల సమస్యలను ఎన్నోసార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదు. ఎమ్మెల్యేగా గెలిస్తే ఈ సమస్యలన్నిటినీ పరిష్కరిస్తాం. గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ కల్పిస్తాం. ప్రజల సమస్యలే అజెండాగా పనిచేస్తాం.

**ప్ర: నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఏమిటి?**

**జవాబు:** 18 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఏనుగుల సమస్య ఉంది. ప్రజల ప్రాణాలు పోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలు కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి. నియోజకవర్గంలో పరిశ్రమలు లేక యువతకు ఉపాధి కరువైంది. వలసల సంఖ్య పెరుగుతుంది. జీడి ప్రోసెస్ యూనిట్ ఏర్పాటు చేయాలి. డైట్ కళాశాల ఏర్పాటు చేసి స్థానికంగా గిరిజనులకు ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వాలి. గిరిజనులకు పక్కా ఇళ్లు కలగానే మిగిలిపోయింది.

## 28 నుంచి జగన్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28 నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారు. ప్రతిరోజూ మూడు నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో సిఎం జగన్ పాల్గొనేలా వైసిపి పర్యటన షెడ్యూల్‌ను రూపొందించింది. గతనెల 27 నుంచి మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సు యాత్ర జరిగిన ప్రాంతాలను మినహాయించి మిగిలిన నియోజకవర్గాలు, కేంద్రీకరించిన నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల ప్రచార సభలో సిఎం జగన్ పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులపాటు 23 జిల్లాల్లో 86 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా 2,188 కిలోమీటర్ల మేర బస్సు యాత్ర సాగింది. ఈ నెల 28 నుంచి ఉదయం 10 గంటలకు ఒక నియోజకవర్గం, మధ్యాహ్నం 12:30 గంటలకు మరొకటి, సాయంత్రం 3 గంటలకు ఇంకో నియోజకవర్గం చొప్పున ప్రచార సభలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ప్రచారాన్ని తాడిపత్రి నుంచి సిఎం ప్రారంభించనున్నారు. ఈ మేరకు మొదటి నాలుగు రోజుల షెడ్యూల్‌ను వైసిపి కేంద్ర కార్యాలయం విడుదల చేసింది.

# కాయ్ రాజా కాయ్..!

- సార్వత్రిక ఎన్నికలపై బెట్టింగుల జోరు
- అభ్యర్థుల గెలుపోటములు, మెజార్టీలపైన కూడా...

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బెట్టింగుల వ్యవహారం ఊపందుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందు నుంచే అభ్యర్థులకు సీట్ల కేటాయింపులపై భారీ స్థాయిలో బెట్టింగులు జరగ్గా.. ప్రస్తుతం అభ్యర్థుల గెలుపోటములు, మెజార్టీలపై పెద్దస్థాయిలో పందేలు జరుగుతున్నాయి. బెట్టింగునే వ్యాపకంగా చేసుకున్న పందెం రాయుళ్లతోపాటు, చాలా మంది ఈసారి బెట్టింగుల వైపు మొగ్గు చూపారు. వీరంతా రూ.వేల నుంచి రూ.కోట్ల వరకు బెట్టింగులు కాస్తున్నారు. ఇద్దరు నుంచి పది మంది వరకు ఒక సమూహంగా ఏర్పడి నగదు సేకరణ చేసి, బాండ్లు రాసుకుని, మధ్యవర్తిని పెట్టుకుని బెట్టింగులు కాస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక మంది ఐపిఎల్ మ్యాచ్‌ల పుణ్యమా అని బెట్టింగుల్లో అడుగుపెట్టేశారు. ఇదే క్రమంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో పార్టీల గెలుపోటములపై ఎన్నడూలేని విధంగా బెట్టింగులకు పాల్పడుతూ, రూ.కోట్లలో కాస్తున్నారు. అనేక మంది స్థలాలు, పొలాలు తనఖాపెట్టి మరీ నగదు తీసుకొచ్చి బెట్టింగులు కాస్తుండగా, మరికొందరు పరువు ప్రతిష్టలకు పోయి ఆ స్థలాలు, పొలాలనే బెట్టింగు వేస్తున్నారు. రాజకీయ పక్షాలు ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించినప్పటి నుంచి ఒక్కసారిగా ఊపందుకున్న బెట్టింగు వ్యవహారం.. అభ్యర్థుల నామినేషన్లతో పీక్ స్థాయికి చేరుకుంది. వివిధ రకాల సంస్థలు ఇచ్చిన సర్వేలు, ప్రజల అభిప్రాయాలు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్న బెట్టింగు రాయుళ్లు ఎంత మొత్తంలో అయినా కాసేందుకు వెనుకాడుట లేదు. ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో ఈ బెట్టింగులు విపరీతంగా జరుగుతున్నాయి.

**అధికారం, గెలుపోటములు, మెజార్టీలపైనే..**

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపితో కూడిన ఎన్‌డిఎ కూటమి ఓ వైపు, అధికార వైసిపి మరోవైపు హోరాహోరీగా ఈ ఎన్నికల్లో తలపడుతున్నాయి. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐతో కూడిన ఇండియా వేదిక కూడా పెద్దస్థాయిలోనే అభ్యర్థులను రంగంలోకి దింపి, ఎన్నికల ప్రచారంలో ముందుంది. ఈ నేపథ్యంలోనే రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ పార్టీ అధికారం చేజిక్కించుకుంటుంది? ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది? అన్న అంశాలపైనే ఎక్కువ శాతం బెట్టింగు జరుగుతోంది. ప్రధానంగా మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గెలుపోటములపై బెట్టింగులు జరుగుతున్నాయి. అలాగే పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపుపై, మెజార్టీపై ఎక్కువగా బెట్టింగులు జరుగుతున్నాయి.

**యాప్‌లలోనూ బెట్టింగు**

రాష్ట్రంలోని ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా కొన్ని యాప్‌లు, ఆన్‌లైన్ సంస్థలు కూడా నేరుగా బెట్టింగులు నిర్వహిస్తున్నాయి. ఐపిఎల్, ఇతర క్రికెట్ మ్యాచ్‌ల మాదిరి బుకీల ద్వారా బెట్టింగులు నిర్వహిస్తున్నాయి. ఐపిఎల్ మ్యాచ్‌లకు బెట్టింగులు నిర్వహించే ఒక అంతర్జాతీయ సంస్థ ఈ బెట్టింగులోకి దిగినట్లు సమాచారం.

# పుంగనూరులో ఎవరి జెండా?

- మంత్రి పెద్దిరెడ్డికి ప్రతిష్టాత్మకం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాయలసీమలోనే కీలక నియోజకవర్గాల్లో ఒకటిగా ఉన్న చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం నుండి తాజా ఎన్నికల్లో వైసిపి తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టిడిపి నుంచి చల్లా రామచంద్రారెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) నుండి బోడె రామచంద్ర యాదవ్, కాంగ్రెస్ వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి జి మురళీ మోహన్ యాదవ్ ...ప్రధానంగా పోటీపడుతున్నారు. పోలింగ్ ఇంకా 15 రోజులు మాత్రమే ఉండడంతో ఆయా

పార్టీల ప్రచారం ఊపందుకుంటోంది. నామినేషన్ల దాఖలు కార్యక్రమం గురువారం ముగియడంతో ఇక ప్రచారోధృతి పెరగనుంది. నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 35వేల ఓట్లు ఉన్నాయి. సదుం, సోమల, చౌడేపల్లి, పుంగనూరు, రొంపిచెర్ల, పులిచర్ల మండలాలు ఈ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గతంలో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సభలు నిర్వహించి, ప్రచారం నిర్వహించేవారు. అయితే ఈసారి పోటీ తీవ్రంగా ఉండడంతో సొంత నియోజకవర్గంపై కేంద్రీకరించి, గడప గడపకూ ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల మాదిరిగా ఈసారి పెద్దిరెడ్డికి ఏకపక్షంగా ఉండదని రాజకీయ విశ్లేషకులు చెపుతున్నారు.

బోడే రామచంద్ర యాదవ్

అనీషారెడ్డి

పెద్దిరెడ్డిది సదుం మండలం యర్రాతివారిపల్లి. 1978లో రాజకీయ అరంగేట్రం చేసి పీలేరు నియోజకవర్గంలో జనతా పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత 1989లో కాంగ్రెస్ నుంచి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంఎల్ఎగా గెలుపొందారు. 1999, 2004, 2009, 2014, 2019ల్లో తిరుగులేని మెజార్టీతో విజయం సాధిస్తూ వచ్చారు. 1994లో అప్పటి టిడిపి అభ్యర్థి జీవి శ్రీనాథరెడ్డి చేతిలో ఓటమిని చవి చూశారు. 2009లో పుంగనూరు నుంచి టిడిపి అభ్యర్థి వెంకట రమణరాజుపై 72,856 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో అదే అభ్యర్థిపై 43,356 ఓట్లు, 2019లో టిడిపి అభ్యర్థి అనీషారెడ్డిపై 63,876 ఓట్ల మెజార్టీ దక్కించుకున్నారు.

టిడిపి అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (చలా బాబు) సొంతూరు రొంపిచెర్ల మండలం. మాజీ ఎంఎల్ఎ చల్లా ప్రభాకర్‌రెడ్డి తనయుడు. తండ్రి 1983లో స్వతంత్ర అభ్యర్థిగా, 1985లో టిడిపి అభ్యర్థిగా పీలేరు నుంచి గెలిచారు. చల్లా రామచంద్రారెడ్డి టిటిడి బోర్డు మాజీ సభ్యులుగా ఉన్నారు. తొలిసారిగా టిడిపి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోటీ చేస్తున్నారు.

బిసివైపి నుంచి బోడే రామచంద్ర యాదవ్ చెరకురైతు గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఆయన సొంతూరు పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం. గతంలో 2019 ఎన్నికల్లో జనసేన తరపున పోటీచేసి 16వేల ఓట్లు సంపాదించుకున్నారు. ఏడాది క్రితం భారత చైతన్య యువజన పార్టీని స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో భాగస్వామిగా ఉన్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచి మంత్రి పెద్దిరెడ్డి దాడులు చేయించి అక్రమ కేసులు బనాయింపజేస్తున్నారని బోడే విమర్శిస్తున్నారు.

కాంగ్రెస్ వేదిక అభ్యర్థి మురళిమోహన్ యాదవ్ మదనపల్లి నియోజకవర్గంలోని రామసముద్రం వాసి. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చారు. వ్యాపార నిమిత్తం తిరుపతికి వచ్చి సెటిలయ్యారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

# చీపురుపల్లిలో రసవత్తర పోరు

## బొత్స అభివృద్ధి మంత్రం... కిమిడి వలసల తంత్రం

(ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి)

విజయనగరం జిల్లాలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ పోటీచేస్తున్న చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి, టిడిపిల మధ్య రసవత్తర పోరు నెలకొంది. అందుకు తగ్గట్టే ఇరు పార్టీల ప్రచారం నువ్వా? నేనా? అన్నట్టు సాగుతోంది. బొత్స అభివృద్ధి మంత్రం వేస్తుండగా, ఇదే నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన టిడిపి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు వలసల తంత్రంతో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మగుంటి సూరినాయుడు కూడా ఇక్కడ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్‌కు సిపిఎం, సిపిఐ తదితర ఇండియా వేదికలోని పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ అభిమానులతోపాటు అధికార, ప్రతిపక్ష పార్టీలపై వ్యతిరేకతతో ఉన్నవారు కాంగ్రెస్‌కు మద్దతిచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ సిటింగ్ ఎమ్మెల్యే అయిన మంత్రి బొత్స నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటికీ కుళాయి సదుపాయం, తోటపల్లి ద్వారా సాగునీరు అందించడంలో సఫలీ కృతులయ్యారు. దీనికితోడు డిగ్రీకాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ కూడా ఆయన హయాంలోనే ఏర్పాటయ్యాయి. ఇవన్నీ ఎన్నికల్లో రాజకీయంగా కలిసివచ్చే అవకాశం ఉందనే చర్చనడుస్తోంది. దీనికితోడు టిడిపికి చెందిన మాజీ జెడ్‌పిటిసి వరహాల నాయుడు నెల రోజుల క్రితమే బొత్స సమక్షంలో వైసిపిలో చేరారు. కానీ, నియోజకవర్గంలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను నిలబెట్టడంలో బొత్స విఫలమయ్యారు. వాస్తవానికి ఇది కేంద్ర, రాష్ట్ర విధానాలతో ముడిపడివున్న అంశం. అందుకు తగ్గట్టే బొత్స కూడా రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత కీలకమైన మంత్రిగా పనిచేశారు. కానీ, విద్యుత్ రాయితీల పెంపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో సానుకూలమైన చర్చ జరిపించేందుకు చొరవ చూపలేదు. పైగా యాజమాన్యాల ఆందోళన సందర్భంగా 'లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా' అంటూ స్పందించడం ఏడాది క్రితం చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి నిర్లక్ష్యంతో గిరివిడి ఫేకర్ క్రమంగా ఉత్పత్తి తగ్గించు కోవాల్సివచ్చింది. గత ఏడాది నవంబర్ నుంచి 100శాతం లేఆఫ్ విధించారు. దీంతో, సుమారు 500 కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి.




టిడిపి ప్రభుత్వంలో మూతపడ్డ ఆంధ్రాఫెర్రో ఎల్లాయిస్ తెరుచుకోకపోవడంతో మరో 500 కుటుంబాలవారు ఏడెనిమిదేళ్లగా ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఎపి ఇపిడిఎస్ఎల్‌లో చీపురుపల్లి ఆర్ఇసిఎస్ విలీనం, ఇసుక దోపిడీ, మద్యం, నిత్యవసర సరుకుల ధరల పెంపు తదితర అంశాలు కూడా నియోజకవర్గంలో అధికార పార్టీకి ప్రతికూలంగా మారాయి. గడిచిన ఐదేళ్లలో పంచాయతీలకు తగిన నిధులు లేకపోవడం, నిధుల మళ్లింపు, సచివాలయాలపై పర్యవేక్షణ అధికారం వంటివి సర్పంచులకు లేకపోవడంతో చాలా వరకు సర్పంచులు విసుగుపోయారు. ఇలాంటి కారణాల వల్ల జమ్ము, జమ్ముపేట, పెనుబర్తి, భూపాలపురం, నడుపూరు, కెల్ల, చింతపల్లిపేట, తాతవారికిత్తలి, గూడెం గ్రామాల్లో వైసిపికి చెందిన సర్పంచులు టిడిపిలో ఇటీవలే చేరారు. గతంలో ఈ గ్రామాల్లో వైసిపికి వన్‌సైడ్ వార్ జరిగింది. ఇటువంటి ప్రభావం దాదాపు నాలుగు మండలాల్లోనూ కొన్ని పంచాయతీల్లో కనిపిస్తోంది.

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగావున్న కిమిడి నాగార్జునకు టిక్కెట్ ఇవ్వకపోవడం, నెలరోజులపాటు అభ్యర్థిని కూడా ప్రకటించకపోవడంతో పార్టీ అధిష్టానంపై కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమైంది. 15రోజుల క్రితం మాజీ మంత్రి, నాగార్జున పెదనాన్న, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావుకు టిక్కెట్ కేటాయించడంతో నాగార్జున మరింత దూరమౌతూ వచ్చారు. ఈ పరిణమాలు వైసిపి స్పీడును పెంచుకునేందుకు దోహదపడినప్పటికీ, అందరూ ఒక తాటిపూకి రావడంతో ఇటీవల టిడిపి పుంజుకుంటోంది.

సీటు ఖరారు కాగానే కళావెంకటరావుకు నియోజకవర్గంలో ఓవైపు పార్టీ కేడర్, మరోవైపు బంధుత్వాలను ఉపయోగించుకుని బలం పెంచుకునేందుకు ప్రయత్నించారు. గత ఎన్నికల్లో అంటీముట్టనట్టుగావున్న నియోజకవర్గ నాయకుడు త్రిమూర్తులురాజు, బిజెపితోవున్న గద్దెబాబురావు ఈసారి చురుకుగా కదులుతున్నారు. నిన్నమొన్నటి వరకు నైర్యాశ్యంలోవున్న నాగార్జున రెండు రోజుల క్రితం జిల్లాకు వచ్చిన చంద్రబాబు జోక్యంతో తిరిగి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. వైసిపికి అడ్డాగావున్న మెరకముడిదాం మండలంలో కీలక నేతలు టిడిపిలో చేరారు. నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి అత్యధికంగా 26వేల మెజార్టీ రాగా, దాదాపు 9వేల వరకు మెరకముడిదాం మండలం ఇచ్చింది. ఇందుకు కారణమైన మాజీ ఎంపిపి, కోట్ల మోతీలాల్, కీలక నేత తాడ్డి చంద్రశేఖర్ ఇటీవలకాలంలో టిడిపిలో చేరారు.

ఇదే నియోజకవర్గం నుంచి బొత్స నాలుగు సార్లు పోటీచేసి, మూడుసార్లు విజయం సాధించారు. ఓడినా, గెలిచినా నియోజకవర్గ రాజకీయ వ్యవహారాలు, గ్రాంట్లు తదితరాలన్నీ ఆయన మేనల్లుడు, ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చూసుకునేవారు. ఈసారి ఎన్నికల్లో బొత్స తన కుమారుడు సందీప్‌ను రంగంలోకి దించారు. దీంతో, మజ్జి శ్రీను కేవలం ప్రచారానికి మాత్రమే పరిమతమై పార్టీని వీడుతున్నో వారిపై దృష్టిపైలేదని తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ టిడిపికి ఏ మేరకు ప్లస్‌గా మారుతాయో వేచి చూడాల్సిందే.

తుమ్మగంటి సూరినాయుడు



కిమిడి కళా వెంకటరావు

## ఉప ఎన్నికలో కల్పనా సోరెన్ పోటీ

రాంచీ : జార్ఖండ్‌లో ఉప ఎన్నిక జరగనున్న గండీ అసెంబ్లీ స్థానం నుంచి మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ జెఎంఎం అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. జెఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. జార్ఖండ్‌లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న మే 20న ఈ ఉప ఎన్నికనూ నిర్వహిస్తున్నారు. ఎంటెక్, ఎంబిఎలను పూర్తి చేసిన కల్పన తన భర్తను జైలుకు పంపిన శక్తులకు తగిన సమాధానం చెబుతానని ప్రకటించారు. హేమంత్ సోరెన్‌ను జనవరి 31న ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

## జగన్ పాలన అంతమే మా పంతం

- కూటమి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలన అంతమే తమ పంతమని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, జనసేన నేతలు పి గౌతమ్, టి శివశంకర్, బిజెపి నేతలు లంకా దినకర్ పి శేఖర్‌రావు.. జగన్ ఐదేళ్ల పాలనపై ఛార్జిషీట్ పేరుతో పుస్తకం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసత్యాలు, అసాధ్యపు వాగ్దానాలతో మరోసారి అధికారంలోకి రావాలని జగన్ చూస్తున్నారని పేర్కొన్నారు.

అలాగే నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బదిలీ చేయాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు వర్ల రామయ్య లేఖ రాశారు. రాష్ట్ర జిఎస్‌డిపిపై తప్పుడు లెక్కలు చూపుతూ రెండు నెలల్లో రూ.94 వేల కోట్ల అప్పు లిమిట్ ఆర్‌బిఐ నుంచి ప్రభుత్వం తెచ్చిందని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. తన ప్రసంగాన్ని వక్రీకరిస్తూ.. తనపై ఫిర్యాదు చేశారని ఎన్నికల కమిషన్ ఇచ్చిన నోటీసుకు టిడిపి ఎన్‌ఆర్‌ఐ కో-ఆర్డినేటర్ కోమటి జయరామ్ సమాధానం ఇచ్చారు.

# నిరసనలతో భగ్గుమన్న అర్జెంటీనా

- బ్యూనస్ ఎయిర్స్‌లో భారీ మార్చ్
- పొదుపు చర్యలకు వ్యతిరేకంగా గర్జించిన విద్యార్థిలోకం

బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన భారీ మార్చ్‌లో పాల్గొన్న విద్యార్థులు

బ్యూనస్ ఎయిర్స్: మితవాద జేవియర్ మిలే ప్రభుత్వ పొదుపు చర్యలపై అర్జెంటీనా విద్యార్థి లోకం భగ్గుమంది. ఉన్నత విద్యకు బడ్జెట్‌లో ఎడా పెడా కోత పెట్టడం, ప్రభుత్వ యూనివర్సిటీ వ్యవస్థను నిర్వీర్యం చేసే మిలే నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో ప్లాజా డి మేయాలో మంగళవారం విద్యార్థులు భారీ మార్చ్ నిర్వహించారు. ' మా కలలను భగ్నం చేయడానికి మీరెవరు?' 'మా భవిష్యత్తును చిదిమేసే అధికారం మీకెవరిచ్చారు?' , 'దేశం అమ్మకానికి సిద్ధంగా లేదు' అన్న నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. విద్యార్థుల ఆందోళనకు మానవ హక్కుల గ్రూపులు, కార్మిక సంఘాలు, వామపక్షాలు తమ పూర్తి మద్దతు ప్రకటించాయి. నిరసనకారులతో ప్లాజా డిమేయా కిక్కిరిసిపోయింది. ఈ మార్చ్‌నుద్దేశించి అర్జెంటీనా యూనివర్సిటీ ఫెడరేషన్ అధ్యక్షుడు పీరా ఫెర్నాండెజ్ డి పికోలి మాట్లాడుతూ, ద్రవ్యోల్బణం కనివిని ఎరుగని రీతిలో పెరిగిపోయిన ఈ స్థితిలో బడ్జెట్‌లో ఉన్నత విద్యకు నిధులు పెంచాల్సింది పోయి కోత పెట్టడం దారుణమని అన్నారు. విద్యా హక్కు మానవ హక్కు అని , అసమానతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించే విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలని ఆయన ఉద్ఘాటించారు.. పబ్లిక్ యూనివర్సిటీలను ప్రైవేట్ పరం చేసే మిలే ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాల్సిన అవసరముందన్నారు. ఈ ఉద్యమానికి బయట నుంచి మద్దతు ఇస్తున్న పౌర సమాజానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత విద్యకు ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్ ఆరు మాసాలకు కూడా చాలదని నేషనల్ ఇంటర్నల్ యూనివర్సిటీ కౌన్సిల్ వ్యాఖ్యానించింది. నిధుల కొరత వల్ల యూనివర్సిటీల్లో కొన్ని ఫ్యాకల్టీలు కొత్తగా చేర్చుకునే విద్యార్థుల సంఖ్యను బాగా కుదించేశాయి. లేబొరేటరీలకు అవసరమైన సామాగ్రి కూడా తెప్పించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ప్రభుత్వ యూనివర్సిటీలు సంక్షోభంలో పడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలన్నా ప్రభుత్వ వర్సిటీలను కాపాడుకోవాలని అన్నారు. ఈ నిరసనలపై మాజీ యూనివర్సిటీ ప్రొఫెసర్, పచ్చి మితవాది అయిన మిలే స్పందిస్తూ, మార్పును అడ్డుకోవడమే వీరి పని అని, నిరసనలో పాల్గొన్నవారంతా పాత ముఖాలేనని హేళన చేశారు. తన ప్రైవేటీకరణ విధానాలను సమర్థించుకున్నారు. మిలే ప్రభుత్వం పొదుపు చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు.

## దేశాన్ని ఇస్లామీకరించే యత్నం

- ముస్లింలకు రిజర్వేషన్లపై విషం కక్కిన యోగి

లక్నో : కర్ణాటకలో ఒబిసి కోటా నుంచి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అదిత్యనాథ్ విషం కక్కారు. దేశాన్ని ఇస్లామీకరించడానికి కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నంగా ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించాలని కాంగ్రెస్ కోరుకుటుందని ఆరోపించారు. యుపిఎ అధికారంలో ఉన్నసమయంలోనూ కాంగ్రెస్ ఇలాంటి నీచమైన పనులు చేసిందని యోగి అన్నారు. కాగా, ముస్లింలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ఇటీవల కాలంలో బిజెపి నాయకులకు అలవాటుగా మారింది.

## ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

అమరావతి బ్యూరో:ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. మార్చి 18 నుంచి 26 వరకు పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగాయి. ఓపెన్ టెన్త్ పరీక్షలకు 32,581 మంది హాజరవ్వగా, 18,185 మంది (55.81 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్‌కు 73,550 మంది హాజరవ్వగా, 48,377 మంది (65.77) ఉత్తీర్ణత సాధించారు. పదోతరగతిలో తూర్పుగోదావరి జిల్లా 92.24 శాతంతో ప్రథమ స్థానంలో, 6.90 శాతంతో ఏలూరు జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. ఇంటర్‌లో తిరుపతి 87.40 శాతంతో ప్రథమ స్థానంలో, 22.88 శాతంతో విశాఖపట్నం చివరి స్థానంలో నిలిచాయి. ఫలితాలను www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అభ్యర్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఈ నెల 29 నుంచి మే 7 వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాలి. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటి నుంచి 8వరకు జరగనున్నాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10న నిర్వహించనున్నారు.

## తొలగిన చంద్రబాబు ముసుగు : హఫీజ్‌ఖాన్

అమరావతి బ్యూరో:ముస్లిం మైనార్టీల భద్రత విషయంలో చంద్రబాబు ముసుగు తొలగిపోయిందని వైసిపి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పదల్చుకున్న మాటలను బిజెపి పెద్దలతో చెప్పిస్తూ మైనార్టీల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నారని విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టిడిపికి మైనార్టీలంటే ఎన్నటికీ చిన్న చూపేనని అన్నారు. పింఛన్లు ఇంటింటికీ వెళ్లి అందజేయకుండా చేసిన చంద్రబాబుకు వాటి గురించి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. ప్రభుత్వ విద్యను సిఎం జగన్ బలోపేతం చేశారని వైసిపి గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి పేర్కొన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు.

## మేనిఫెస్టోపై వివరిస్తాం.. సమయం ఇవ్వండి

- మోడీకి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ : న్యాయ్ సంకల్ప పేరుతో కాంగ్రెస్ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోపై వివరణ ఇస్తామని, దీనికి సమయం కేటాయించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే లేఖ రాశారు. ఇటీవల ఎన్నికల సభల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోపై మోడీ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఖర్గే ఈ లేఖ రాశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి ప్రధానమంత్రి మోడీకి ఆయన సహాయకులు తప్పుగా చెప్పి ఉంటారని, సమయం ఇస్తే మేనిఫెస్టోపై పూర్తి వివరణ ఇస్తామని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఖర్గే రాసిన లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'యువకులకు, మహిళలకు, రైతులకు, కార్మికులకు, అట్టడుగు ప్రజలకు న్యాయం' చేసే లక్ష్యంతో కాంగ్రెస్ న్యాయ్ సంకల్ప్‌ను విడుదల చేసిందని ఖర్గే తెలిపారు. 'మొదటి దశ ఎన్నికల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో బిజెపి నాయకులు ఈ విధంగా మాట్లాడుతారని ఊహించాం' అని ఖర్గే పేర్కొన్నారు. పేదల సంపాదన, సంపదను కొల్లగొట్టడమే బిజెకి పాలన ఉద్దేశ్యమని, పేదలకు సాధికారత కల్పించేందుకు కాంగ్రెస్ ఎప్పుడూ కృషి చేస్తుందని ఖర్గే తెలిపారు. సందర్భానుసారంగా తీసుకున్న కొన్ని పదాలకు ప్రధాని మోడీ కొత్త అర్థాలు కల్పించి ప్రజల్లో మతపరమైన విభజనకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోడీ చేసిన 'మంగళసూత్ర' ఆరోపణలను ప్రస్తావిస్తూ, 'మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలు, యుపిలో దళిత బాలికలపై అఘాయిత్యాలు, రేపిస్టులకు పూలమాల వేయడం మీ ప్రభుత్వ నిర్వాకం కాదా?' అని ప్రశ్నించారు. 'బిజెపి ప్రభుత్వ హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారి భార్యాబిడ్డల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?' అని ఖర్గే లేఖలో ప్రశ్నించారు.

## నేరస్తులైన రాజకీయ నేతలను అరెస్టు చేయకుండా ఎలా?

### కేజ్రీవాల్ అరెస్ట్‌పై సుప్రీం కోర్టులో ఇడి అఫిడవిట్

న్యూఢిల్లీ : నేరస్తులైన రాజకీయ నేతలను అరెస్టు చేయడం స్వేచ్ఛా, సక్రమ ఎన్నికల నిర్వహణకు ఎదురు దెబ్బ కాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం సుప్రీంకోర్టులో తెలిపింది. ఎన్నికల్లో వారు ప్రచారం చేయాలనుకుంటున్నారనే కారణంతో నేరస్తులైన రాజకీయ నేతలను అరెస్టు చేయకుండా ఎలా రక్షణ కల్పిస్తామని ఇడి ప్రశ్నించింది. వారిపట్ల భిన్నంగా వ్యవహరించడమనేది రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఇడి 87 పేజీల అఫిడవిట్‌ను కోర్టుకు అందజేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు చేయడం వెనుక గల ఉద్దేశాలపై విమర్శలు వెల్లువెత్తాయి. పాలక బిజెపికి రాజకీయ విభాగంగా ఇడి మారిపోయిందని, ఎన్నికల ప్రచారానికి వెళ్లకుండా అడ్డుకోవడమే అరెస్టు వెనుక ఉద్దేశమని ఆప్ సహా ప్రతిపక్షాలన్నీ విమర్శించాయి. మనీ లాండరింగ్ కేసులో సిఎం దోషి అని సూచిస్తున్న సాక్ష్యాధారాల ఆధారంగానే కేజ్రీవాల్ అరెస్టు జరిగిందని ఇడి తెలిపింది. అరెస్టు అనేది దర్యాప్తులో భాగమని వ్యాఖ్యానించింది. అరెస్టుతో సహా దర్యాప్తు అనేది దర్యాప్తు సంస్థకు ప్రత్యేకంగా రిజర్వ్ చేయబడిన అంశమని పేర్కొంది.

## ఆ నివేదికకు విలువలేదు

మానవ హక్కులపై అమెరికా రిపోర్టును తిరస్కరించిన భారత్

న్యూఢిల్లీ : దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందన్న అమెరికా నివేదికను భారత్ గురువారం తిరస్కరించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ మీడియా సమావేశంలో ఈ నివేదికపై మీడియా ప్రశ్నించింది. ఈ నివేదిక తీవ్ర పక్షపాతంతో కూడుకున్నదని, దేశంపై సరైన అవగాహన లేదనడానికి నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆ నివేదికకు ఎటువంటి విలువ లేదని, మీరు కూడా పట్టించుకోవద్దని మీడియాకు సూచించారు. గతేడాది మణిపూర్‌లో హింసాకాండ చెలరేగిన తర్వాత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ "2023 కంట్రీ రిపోర్ట్స్ ఆన్ హ్యూమన్ రైట్స్ ప్రాక్టీసెస్: ఇండియా " పేరిట ఇటీవల ఓ నివేదికను విడుదల చేసింది.

## సందేశ్‌ఖలి కేసులో సిబిఐ తొలి ఎఫ్‌ఐఆర్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలిలో దురాగతాల కేసుకు సంబంధించి తొలి ఎఫ్‌ఐఆర్‌ను సిబిఐ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఐదుగురు కీలక వ్యక్తులకు వ్యతిరేకంగా భూకబ్జాలు, లైంగిక వేధింపుల ఆరోపణలతో ఈ ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేసినట్లు గురువారం తెలిపారు. ఆ ఐదుగురి వివరాలను సిబిఐ అధికారులు వెల్లడించలేదు. కోల్‌కత్తా హైకోర్టు ఈ నెల 10 ఇచ్చిన ఆదేశాలతో ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. సమగ్ర విచారణ నివేదికను మే 2న తదుపరి విచారణలో సమర్పించాలని హైకోర్టు సిబిఐను ఆదేశించింది. ఈ కేసుల బాధితులు ఫిర్యాదు చేసేందుకు సిబిఐ ప్రత్యేక ఈమెయిల్‌ను కూడా ఏర్పాటుచేసింది. క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు సందేశ్‌ఖలిలో దర్యాప్తు బృందం కూడా పర్యటించింది.

## ఐఎఫ్ఎస్ అధికారికి ప్రశంస

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

డెహ్రాడూన్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్టు అకాడమీ అధికారుల కాన్వకేషన్‌లో ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఎమ్‌డి అబ్దుల్ రవూఫ్ చరిత్ర సృష్టించారు. వృత్తిపరమైన శిక్షణ కోర్సులో అత్యధిక మొత్తం మార్కులు సాధించటంలో అత్యుత్తమ విజయాన్ని సాధించినందుకు ఆల్‌రౌండర్ అత్యుత్తమ పనితీరు పతకాన్ని అందుకున్నారు. దీంతోపాటు మరో ఆరు పతకాలు, బహుమతులు అందుకున్నారు. విజయవాడకు చెందిన రవూఫ్ ఐఐటి బొంబాయిలో సివిల్ ఇంజినీరింగ్ బిటెక్ చేశారు. ఫారెస్టు సర్వీసులో చేరటానికి ముందు రెండు సంవత్సరాలకు పైగా చెన్నైలోని నాబార్డ్‌లో పనిచేశారు. కాగా ఆల్‌రౌండ్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆయన్ను ప్రభుత్వం అభినందించింది.

## అల్టిమేటం జారీ చేస్తామంటే కుదరదు

- బ్లింకెన్ పర్యటన సందర్భంగా స్పష్టం చేసిన చైనా
- తైవాన్, దక్షిణచైనా సముద్ర దీవులపై జోక్యం తగదని హితవు

బీజింగ్: "చైనాకు అల్టిమేటం జారీ చేయడానికి బ్లింకెన్ ఇక్కడకు వచ్చి ఉన్నట్లైతే, మేము ఆయనకు లొంగిపోం, మా ప్రధాన సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదు" అని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. షాంఘైలో, బ్లింకెన్ "చైనా వాణిజ్య విధానాలు, మార్కెటే తర ఆర్థిక విధానాలపై ఆందోళనలు" లేవనెత్తినట్లు వచ్చిన వార్తలపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్బిన్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా ఎల్లప్పుడూ మార్కెట్ సూత్రాలకు అనుగుణంగా ఆర్థిక, వాణిజ్య సహకారా న్ని నిర్వహిస్తుందని, బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థకు దఢంగా మద్దతు ఇస్తుందని, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.. చైనా-అమెరికా ఆర్థిక, వాణిజ్య సంబం ధాల ఆరోగ్యకరమైన మరియు స్థిరమైన అభివద్ధికి అనుకూలమైన పరిస్థితులను సష్టించడానికి అమెరికా చైనాతో కలిసి పనిచేస్తుంద ని అన్నారు. చైనాలో తన మూడు రోజుల పర్యటనను ప్రారంభించడానికి ముందు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ చైనా కమ్యూనిస్టు పార్టీ షాంఘై చీఫ్ చెన్ జినింగ్‌తో బుధవారం సమావేశమయ్యారు. చైనా-అమెరికా సంబంధాల ను బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన ఆవశ్యకత ను ఆయన నొక్కి చెప్పారు. అయితే ఈ బాధ్యత చైనా, అమెరికా రెండింటిపైనా ఉంది, కాబట్టి ఇది క్రమం, విధేయత కంటే సమాన స్థాయి కమ్యూని కేషన్‌లో ఉండాలని చైనా పరిశీలకులు చెప్పారు, బ్లింకెన్ పర్యటన చైనాను బాగా అర్థం చేసుకో వడానికి సహాయపడుతుందని చైనా భావిస్తోంది. బ్లింకెన్ పర్యటన సందర్భంగా అయిదు అంశాలపై చైనా తన వైఖరిని స్పష్టం చేసింది. చైనాలో మానవ హక్కుల గురించి అమెరికా అసత్య ప్రచారం మానుకోవాలని, దక్షిణ చైనా సముద్రం, తైవాన్ వంటి అంశాలపై చైనా సార్వ భౌమత్వానికి భంగం కలిగించే ఎటువంటి జోక్యాన్ని అనుమతించేది లేదని చెప్పింది. వాణిజ్య సంబంధాలు, ఆంక్షలకు సంబంధించిన అంశాలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పింది. వాణిజ్యంలో ప్రతిష్టంభనను తొలగించే అంశంపై ఇప్పటికే రెండు దఫాల చర్చలు జరిగాయి.

## అవినాష్ తప్పు చేయలేదని నమ్మి టికెట్ ఇచ్చా

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని వివరించారు. వైఎస్ఆర్, వైఎస్ జగన్, కడప, పులివెందుల పేర్లను చెరిపేయాలనే వాళ్లు జిల్లా, రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకులన్నారు. అంతకుముందు వైసిపి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమికి స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని, వైసిపికి యువత, రైతులు, ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని తెలిపారు.

**నామినేషన్ పత్రాలు అందజేత**

పులివెందుల అసెంబ్లీ స్థానానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం విజయవాడ నుంచి పులివెందులకు చేరుకున్న ఆయనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. సిఎస్ఐ చర్చి మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ పాల్గొన్నారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వెంకటేష్‌కు నామినేషన్ పత్రాలను అందించారు.

## తెగిపడిన మంగళసూత్రాలకు బాధ్యులెవరు?

### మోడీ వ్యాఖ్యలపై తేజస్వీ యాదవ్

పాట్నా : ఎన్నికలు ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఉండాలని, భారీగా పెరుగుతున్న ధరలతో మహిళలు బంగారం కొనలేని స్థితిలో ఉన్నప్పుడు 'మంగళసూత్రాలు' గురించి మాట్లాడటం ఎందుకని ప్రధానమంత్రి మోడీని ఆర్‌జెడి నాయకులు తేజస్వియాదవ్ ప్రశ్నించారు. 'కోవిడ్ మహమ్మారి సమయంలోనూ, నోట్ల రద్దు తరువాత, పుల్వామా ఉగ్రదాడి, సరిహద్దుల్లో ఘర్షణల కారణంగా అనేక మంది మహిళల మంగళసూత్రాలు తెగిపడ్డాయి. వీటికి ఎవరు బాధ్యత వహిస్తారో ప్రధానమంత్రి చెప్పాలి' అని అన్నారు. పాట్నాలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీహార్‌లో రెండో దశ ఎన్నికలు జరుగుతున్న మొత్తం ఐదు స్థానాలను ఆర్‌జెడి, మిత్రపక్షాలు గెలుచుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు.

## మోడీతో బాబు పొత్తు, జగన్ తొత్తు

(మొదటిపేజీ తరువాయి)

విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిన మోడీతో జగన్ అంటకాగుతున్నారని విమర్శించారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే రాజధాని లేదని, మన రాష్ట్రానికి ఇటువంటి దుస్థితి వైసిపి ప్రభుత్వ హయాంలోనే వచ్చిందని అన్నారు. చంద్రబాబు కూడా అన్నీ అబద్ధాలే చెపుతున్నారని విమర్శించారు. సింగపూర్ లాంటి రాజధాని అన్నారని, అటువంటిదేమీ నిర్మించలేదని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో రాజధానిలో తాత్కాలిక భవనాలు నిర్మించడం తప్ప, ఏమీ అభివృద్ధి చేయలేదన్నారు. విదేశాలు వెళ్లొచ్చారు తప్ప, పెట్టుబడులు తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, రాజధాని నిర్మాణం సహా అన్ని సమస్యలకూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పరిష్కారం లభిస్తుందన్నారు. ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ విజయవాడ ఎంపి అభ్యర్థి వల్లూరు భార్గవ్, సిపిఎం విజయవాడ సెంట్రల్ అభ్యర్థి చిరుగుపాటి బాబూరావు, సిపిఐ విజయవాడ పశ్చిమ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, సిపిఐ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, సిపిఎం మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి జొన్నా శివశంకరరావు, కాంగ్రెస్ పార్టీ గుంటూరు తూర్పు అభ్యర్థి మస్తాన్ వలి, పశ్చిమ అభ్యర్థి జాన్‌బాబులను గెలిపించాలని కోరారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పి.రామారావు, నగం కార్యదరి కె.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలో తాళిబొట్లూ కార్పొరేట్లకే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రణాళికలను రూపొందించుకుంటున్నాయి.

**కోవిడ్ తరువాత...**

కరోనా మహమ్మారి తరువాత బంగారాన్ని తాకట్టు పెట్టి తమ కనీస అవసరాలు తీర్చుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నిరుద్యోగం పెరగడం, ఉన్న ఉద్యోగాలు పోవడం, నిజవేతనాలు పెరగకపోగా తగ్గడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం ఈ పరిస్థితికి కారణం. వీటితో పాటు పిల్లల చదువుల ఖర్చులు భారీగా పెరిగాయి. ఏ ఒక్కరికి అనారోగ్యం చేసినా కుటుంబం మొత్తం రోడ్డున పడేలా పెరిగిన వైద్య సేవల ఖర్చు కూడా పేదల కష్టార్జితం తరలిపోవడానికి కారణం. 2017-18 నుండి 2022-23 మధ్యకాలంలో నెలసరి, దినసరి ఆదాయం పొందే వారి వాస్తవ వేతనాలు తగ్గాయని ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్) చెబుతోంది. కుటుంబాల రుణభారం పెరగడం, పొదుపు తగ్గిపోవడంపై ఆర్‌బిఐ సైతం ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

**నోట్లరద్దు ..జిఎస్‌టి కూడా**

పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి విధింపు కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. వినియోగ పన్నులో 65 శాతం వాటా కలిగిన కార్మిక వర్గంపై జిఎస్‌టి రేట్లు ప్రతికూల ప్రభావం చూపాయి. కార్మికుల వేతనాల్లో పెరుగుదల లేకపోవడం, నిత్యావసర వస్తువులు ధరలు చుక్కలు దాటడంతో బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకోవడం ఎక్కువైంది.

ఆరు ఓటముల తర్వాత

# బెంగళూరు ఖాతాలో గెలుపు

### కోహ్లి, పాటీధర్ అర్ధసెంచరీలు ఛేధనలో సన్‌రైజర్స్ విఫలం

హైదరాబాద్: వరుసగా ఆరు ఓటముల తరువాత రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు (ఆర్‌సిబి) ఒక విజయాన్ని అందుకుంది. గురువారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. ఓపెనర్ విరాట్ కోహ్లి(51), రజత్ పాటిదార్(50)లు అర్ధ సెంచరీకి తోడు.. చివర్లో కామెరూన్ గ్రీన్(37 నాటౌట్), ఇంప్యాక్ట్ ప్లేయర్ స్వప్నిల్ సింగ్(12)లు బౌండరీలతో అలరించారు. నటరాజన్ వేసిన 20వ ఓవర్‌లో స్వప్నిల్ సిక్స్, ఫోర్ బాదాడు. దాంతో బెంగళూరు నిర్ణీత ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఇటీవల వరుసగా భారీ స్కోర్లు నమోదు చేస్తున్న హైదరాబాద్ ఈ లక్ష్యాన్ని సులభంగానే అందుకుంటుందని అభిమానులు భావించారు. పైగా సొంత మైదానంలో ఆడుతున్న హైదరాబాద్‌కు కలిసివస్తుందని అనుకున్నారు. అయితే ఓపెనర్లతో పాటు మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ (31), అజేయంగా నిలిచిన షహబాజ్ అహ్మద్ (40) మాత్రమే బెంగళూరు బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. దీంతో హైదాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 171 పరుగులు మాత్రమే చేసింది. ఆర్‌సిబి 35 పరుగులతో ఘనవిజయం సాధించింది. తన ప్లే ఆఫ్ అవకాశాలు సజీవంగా నిలుపుకొంది. 20 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసిన రజత్ పాటిదార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

గురువారం మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడిన హైదరాబాద్ బెంగళూరుకు బ్యాటింగ్ అప్పగించింది. దీంతో చిన్నస్వామి స్టేడియంలో హైదరాబాద్ బ్యాటర్లు రికార్డు స్కోర్ నమోదు చేస్తే.. ఉప్పల్ స్టేడియంలో బెంగళూరు బ్యాటర్లు భారీస్కోర్‌ను నమోదు చేశారు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఉనాద్కట్ (3/40)తో రాణించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న బెంగళూరుకు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. అభిషేక్ శర్మ వేసిన తొలి ఓవర్‌లో విరాట్ కోహ్లి బౌండరీతో 10 పరుగులు రాబట్టాడు.

ఆ తర్వాత భువనేశ్వర్, కమిన్స్ బౌలింగ్‌లో కోహ్లి, డూప్లెసిస్ లు బౌండరీలతో చెలరేగారు. దాంతో బెంగళూరు స్కోర్ 3ఓవర్లకే 40 పరుగులు చేసింది. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్.. నటరాజన్‌ను రంగంలోకి దించి ఫలితం రాబట్టాడు. ఆ తర్వాత వచ్చిన విల్ జాక్స్(6)ను మార్కండే బౌల్డ్ చేసి ఆర్సీబీని ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే.. కోహ్లితో జతకట్టిన రజత్ పాటిదార్ సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు.

20 బంతుల్లోనే అర్ధ శతకంతో బెంగళూరు స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఆ పరిస్థితుల్లో ఉనాద్కట్ ఈ ఇద్దరినీ వెనక్కి పంపి భారీ స్కోర్ దిశగా పరుగెడుతున్న బెంగళూరుకు కళ్లెం వేశాడు. అయితే.. చివర్లో కామెరూన్ గ్రీన్(37 నాటౌట్) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కమిన్స్ టార్గెట్‌గా ఫోర్ల మీద ఫోర్లు బాదాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ స్వప్నిల్ సింగ్(12) సైతం బ్యాటు ఝుళిపించారు. దీంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 206పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు ఉనాద్కట్‌కు మూడు, నటరాజన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

## చెస్ ఆణిముత్యం గుకేశ్‌కు ఘన స్వాగతం

చెన్నై విమానాశ్రయంలో గుకేశ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

చెన్నై: టొరంటో వేదికగా జరిగిన ఫిడే క్యాండెడేట్ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కెనడా నుంచి గురువారం భారత్‌కు చేరుకున్న గుకేశ్‌కు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. వందలాది మంది విద్యార్థులు, శ్రేయోభిలాషులు ఎయిర్ పోర్ట్‌కు చేరుకుని అభినందిచారు.

అనంతరం చెన్నైలోని మొగప్పైర్ ప్రాంతంలోని తన పాఠశాల వేలమ్మాళ్ విద్యాలయాన్ని గుకేష్ సందర్శించాడు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అతనికి స్వాగతం పలికారు.

గుకేశ్‌ను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. గుకేశ్ 17ఏళ్ల వయసులోనే ఫిడే క్యాండిడేట్స్ టోర్నమెంట్ టైటిల్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. అత్యంత పిన్న వయసులోనే వరల్డ్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచిన తొలి ఆటగాడిగా నయా చరిత్ర లిఖించాడు.

**ఐపిఎల్‌లో నేడు**

కోల్‌కతా నైట్‌రైడర్స్
×
పంజాబ్ కింగ్స్

వేదిక: కోల్‌కతా; రా.7.30గం॥లకు

**పాయింట్ల పట్టిక**

| జట్టు | మ్యా | గె | ఓ | పా | నె.ర. |
|---|---|---|---|---|---|
| రాజస్తాన్ | 8 | 7 | 1 | 14 | 0.69 |
| కోల్‌కతా | 7 | 5 | 2 | 10 | 1.20 |
| సన్‌రైజర్స్ | 8 | 5 | 3 | 10 | 0.57 |
| లక్నో | 8 | 5 | 3 | 10 | 0.14 |
| చెన్నై | 8 | 4 | 4 | 8 | 0.41 |
| ఢిల్లీ క్యాపిటల్స్ | 9 | 4 | 5 | 8 | -0.38 |
| గుజరాత్ | 8 | 4 | 4 | 8 | -1.05 |
| ముంబయి | 8 | 3 | 5 | 6 | -0.22 |
| పంజాబ్‌కింగ్స్ | 8 | 2 | 7 | 4 | -0.29 |
| బెంగళూరు | 9 | 2 | 7 | 4 | -0.72 |

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

# రిగ్గింగ్ వల్లే వంద శాతానికిపైగా ఓటింగ్

- రీపోలింగ్ నిర్వహించండి
- సిపిఎం త్రిపుర కార్యదర్శి జితేంద్రచౌదరి డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్రిపురలోని పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గంలో, రామ్‌నగర్ శాసనసభ స్థానంలో ఈనెల 19న జరిగిన పోలింగ్‌లో వంద శాతానికిపైగా పోలింగ్ నమోదుకావడంపై సిపిఎం విస్మయం వ్యక్తం చేసింది. ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, మళ్లీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. స్వేచ్ఛగా, న్యాయంగా ఈ ఎన్నికలు జరగలేదని సిపిఎం త్రిపుర శాఖ కార్యదర్శి జితేంద్ర చౌదరి విమర్శించారు. మజ్లిస్‌పూర్ సెగ్మెంట్‌లో 105.30 శాతం, ఖాయర్‌పూర్‌లో 100.15 శాతం, మోహన్‌పూర్ సెగ్మెంట్‌లో 109.09 శాతం పోలింగ్ నమోదైంది. "పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికలు, అదే పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగమైన రామ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక స్వేచ్ఛగా, న్యాయంగా, సాధారణ పద్ధతిలో జరగలేదని పై రికార్డులు రుజువు చేస్తున్నాయి. బూతును స్వాధీనం చేసుకున్నప్పుడు, వ్యవస్థీకృత పద్ధతిలో పూర్తిగా రిగ్గింగ్ చేసినప్పుడే ఇటువంటి సరిపోని పోలింగ్ శాతం జరుగుతుంది" అని విమర్శించారు.

"రిటర్నింగ్ అధికారి కార్యాలయం ద్వారా పోలింగ్ స్టేషన్ల వారీగా పోలింగ్ రిపోర్టుల నుండి డేటా సేకరించాం. రిటర్నింగ్ అధికారికి ప్రిసైడింగ్ అధికారి రిపోర్టులు అందించిన పోలింగ్ స్టేషన్ వారీ డేటా పబ్లిక్‌గా అందు బాటులో లేనప్పటికీ, డిమాండ్‌ను బట్టి దాన్ని యాక్సెస్ చేయవచ్చు. అలాంటి వివరాలు తీసుకున్నాం" అని ఆయన తెలిపారు.

**మళ్లీ పోలింగ్ నిర్వహించండి : సిపిఎం, కాంగ్రెస్**

లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం, కాంగ్రెస్ డిమాండ్ చేశాయి. లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్‌కర్ మాట్లాడుతూ త్రిపుర పశ్చిమ లోక్‌సభ సీటు, రామ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సక్రమంగా పోలింగ్ నిర్వహణలో ఎన్నికల సంఘం విఫలమైందని విమర్శించారు. చాలా ఎక్కువ నకిలీ ఓటింగ్ జరిగిందని, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా అధికార పార్టీ గూండాలు అడ్డుకున్నారని కాంగ్రెస్ నేత సుదీప్ రాయ్ బర్మన్ విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఉన్న వివిధ కేసుల వివరాలను డేటా బేస్‌లో తప్పక నమోదు చేయాలని సాధారణ పరిపాలనశాఖ తేల్చి చెప్పింది. ఈ మేరకు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు స్పష్టం చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. ఇందులో శాఖాపరమైన కేసులు, అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్, ఇతర రకాల కేసుల వివరాలు కూడా స్పష్టంగా నమోదు చేయాలని నిర్దేశించింది. విధుల్లో ఉన్న ఉద్యోగుల కేసుల వివరాలే కాకుండా పదవీ విరమణ చేసిన వారిపై ఉన్న కేసుల వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. శాఖల వారీ ఉద్యోగులపై ఉన్న కేసుల వివరాలను ఆయా శాఖల డిడిఒల వద్ద మ్యాపింగ్ చేయాలని సాధారణ పరిపాలనశాఖ పేర్కొంది. దీనికోసం పది దశలను నిర్దేశించింది. అలాగే ఈ డేటాను పొందుపరి చేందుకు ఆయా శాఖల్లోని విజిలెన్స్ సిబ్బంది సాయం తీసుకునేలా విజిలెన్స్ అధికారులను ఆదేశించాలని కార్యదర్శులకు స్పష్టం చేసింది. దాదాపు ప్రతి శాఖలోనూ అనేక మంది ఉద్యోగులపై రకరకాల కేసులు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటివరకు విడివిడిగానే కాగితాలపై ఉండడంతో పర్యవేక్షణకు ఇబ్బందిగా ఉంటోందన్న భావన వ్యక్తమవుతోంది. ఎసిబి కేసులు నేరుగా ఎసిబి అధికారులు పర్యవేక్షిస్తుండగా, శాఖాపరమైన కేసులు ఆయా శాఖల అధికారులే చూస్తున్నారు. అతి ముఖ్యమైన కేసులు మాత్రమే విజిలెన్స్ కమిషన్ దృష్టికి వెళ్తున్నాయి. ఇలా అనేక విభాగాల వద్ద కేసులు ఉండడంతో వాటిని క్రోడీకరించడం కూడా కష్టంగా మారుతున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. అందుకే అన్ని కేసుల వివరాలనూ ఒకే గూటికి తీసుకొచ్చేందుకు డేటా బేస్‌లో నమోదు చేయాలని నిర్ణయించింది.

# నయవంచక మోడీని ఓడించాల్సిందే

- 'నయవంచన పదేళ్ల నిరంకుశ పాలన' పుస్తకావిష్కరణలో వడ్డే శోభనాద్రీశ్వరరావు

'నయవంచన- పదేళ్ల నిరంకుశపాలన - పది దారుణ మోసాలు' పుస్తకం ఆవిష్కరిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

దేశంలో ఈ పదేళ్ల కాలంలో కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా దేశాన్ని నిరంకుశత్వంవైపు తీసుకెళ్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ పౌరసంఘాలు రూపొందించిన 'నయవంచన- 10 సంవత్సరాల నిరంకుశపాలన - పది దారుణ మోసాలు' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. పౌర సంఘాల నాయకులు వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కె విజయరావు, భారత బచావో నాయకులు భాస్కరరావు, రైతు సంఘం (దాసరి భవనం)నాయకులు పి జమలయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కేవలం కార్పొరేట్ ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రతిపక్ష పార్టీలతోపాటు మీడియా సంస్థలను, జర్నలిస్టులను జైళ్లకు పంపుతోందన్నారు. పొరుగున వున్న తమిళనాడుకు నిబంధనల మేరకు అప్పులు చేసుకునేందుకు అనుమతులివ్వని మోడీ ప్రభుత్వం... జగన్ ప్రభుత్వం పరిధి దాటి అప్పులు చేస్తున్నా అనుమతులు ఇస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కూడా అవినీతి రాజ్యమేలుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ ఎన్నికల్లో ఇంటికి పంపాలని కోరారు. కర్ణాటక రాష్ట్రంలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు పౌరసంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి బిజెపి మతోన్మాద విధానాలను ఎండగట్టడంతో ఆ రాష్ట్రంలో బిజెపి చిత్తుగా ఓడిపోయిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా పౌరసంఘాలన్నీ మోడీ, జగన్‌ను ఇంటికి పంపి ఇండియా వేదికను గెలిపించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశ ప్రజలకు మోడీ చేసిన మోసాలను ఈ పుస్తకంలో చక్కగా వివరించారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పుడు రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేందుకు కుట్రలు చేస్తోందని అన్నారు. ప్రజలు అప్రమత్తమై సమైక్యంగా ఇండియా వేదికలోని పార్టీలను గెలిపించాలని కోరారు.

## ఒకటో తేదీన ఇంటివద్దకే పింఛను

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళ, చేనేత కార్మిక, మత్స్యకార, డప్పు కళాకారుల పింఛన్లు సచివాలయాల వద్ద కాకుండా మే ఒకటో తేదీన ఇంటి వద్దే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోజురోజుకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో వికలాంగులు, వృద్ధులు బయటకు రాలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో పింఛన్ల పంపిణీ సచివాలయాల వద్ద ఇవ్వడం వల్ల వృద్ధులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని అన్నారు. కొన్నిచోట్ల మరణాలు కూడా సంభవించాయని, గంటల తరబడి సచివాలయాల వద్ద పడిగాపులు కాసినా, నగదు లేదని సిబ్బంది సమాధానం చెప్పడం, ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛను సకాలంలో ఇవ్వకపోవడంతో పింఛనుదారులు నానా అవస్థలు పడ్డారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసాలకు సచివాలయాలు దూరంగా ఉండటంతో రవాణా సదుపాయం లేక, కొండలు దిగి రాలేక మరిన్ని ఇబ్బందులు పడ్డారని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పింఛన్లు సకాలంలో ఇంటివద్దే పంపిణీ చేయాలని కోరారు. వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి ఇతర విధులు అప్పగించకుండా సరిపడా నగదు ముందుగానే అందేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటర్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఒకేసారి మే 24 నుంచి పరీక్షలు ప్రారంభమై జూన్ ఒకటితో ముగియనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు జరగనున్నాయి. మే 24, 25, 27, 28, 29, 30, 31, జూన్ ఒకటో తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పర్యావరణ విద్య పరీక్షలు జూన్ 6, 7 తేదీల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయి. జనరల్, వొకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు మే ఒకటి నుంచి 4వ తేదీ వరకు రెండు పూటలా నిర్వహించనున్నారు.

## కొండయ్య నామినేషన్‌లో సినీ హీరో నిఖిల్

**చీరాల :** టిడిపి చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కొండయ్య పెద్దకుమారుడి బావ, సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ పాల్గొని సందడి చేశారు. హ్యాపీ డేస్ సినిమాలోని జిల్ జిల్ జిగా డైలాగులతో యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. చీరాల అభివద్ధి చెందాలన్నా..యువత భవిత బంగారుమయం కావాలన్నా టిడిపి అభ్యర్థి మాలకొండయ్యను గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో నిఖిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కోదండరాముడి చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

## వైభవంగా శ్రీకోదండరాముడి చక్రస్నానం

- ధ్వజారోహణతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి - ఒంటిమిట్ట**

వైఎస్‌ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల చివరిరోజు గురువారం స్థానిక పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొని స్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం నాలుగు గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. 9.30 గంటలకు లక్ష్మణ సమేత సీతారాములవారిని తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువెళ్లారు. ఉదయం 10.30 గంటల నుండి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు ధ్వజారోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్**
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య : L24239AP2005PLC047518
**రిజిస్టర్డ్ ఆఫీస్:** లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా - 531 021, ఆంధ్రప్రదేశ్.
**కార్పొరేట్ ఆఫీస్:** 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
Phone: +91 40 6659 4333; Fax: +91 40 6659 4320
Email: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com

**రికార్డు తేది ప్రకటన**

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 91 యొక్క నియమాలు మరియు రూల్స్ మరియు ది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్స్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్స్ 42&43 అనుసరించి, ఏప్రిల్ 25, 2024న నిర్వహించబడిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆర్థిక సం॥ 2023-24 కొరకు ప్రతి వాటా ముఖ విలువ రూ. 2/- తో వాటా ఒక్కొంటికి రూ. 0.40 (20%)గా 02వ మధ్యంతర డివిడెండ్ చెల్లించుటకై వాటాదారుల అర్హత నిర్ధారించుట కొరకు "రికార్డు తేది"ని "మే 08, 2024"గా నిర్ణయించబడినది మరియు మే 17, 2024న లేదా తరువాత డివిడెండ్ చెల్లించబడుతుంది.
తదుపరి, ఈ ప్రకటన కంపెనీ యొక్క వెబ్‌సైటు www.lauruslabs.com వద్ద కూడా అందుబాటులో ఉంటుంది.

బోర్డు ఆదేశం మేరకు
**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్** తరపున
సం/- జి. వెంకటేశ్వర్ రెడ్డి
కంపెనీ సెక్రటరీ

**ప్రదేశం: హైదరాబాద్**
**తేది: 25.04.2024**

# పింఛ, అన్నమయ్య డ్యాములు పునర్నిర్మిస్తాం

- జగన్‌పై తిరుగుబాటు మొదలైంది
- వైసిపిని అధఃపాతాళానికి తొక్కాలి
- రాజంపేట సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్

రాజంపేట సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన పవన్ కళ్యాణ్, కిరణ్‌కుమార్ రెడ్డి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

తాము అధికారంలోకి వస్తే పింఛ, అన్నమయ్య డ్యాములు పునర్నిర్మించి మాచుపల్లి బ్రిడ్జి నిర్మిస్తామని, గాలేరు నగరి కాలువ పూర్తి చేసి కృష్ణా జలాలు తీసుకొస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలూ అణచివేతకు గురయ్యారని ఆవేదన చెందారు. రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమిగా ఎన్నికలకు వెళుతున్నామని, సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమం తీసుకొస్తామని తెలిపారు. చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌లు ఉమ్మడిగా రాజంపేట, రైల్వేకోడూరుల్లో ప్రజాగళం బహిరంగ సభలు నిర్వహించారు. రాజంపేటలోని పాత బస్టాండ్ కూడలికి సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిపై తిరుగుబాటు మొదలైనట్లు ప్రజల్లో సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. జగన్ పాలనలో ధరలు ఆకాశాన్నంటి పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు అడుగంటాయని తెలిపారు. ఇసుక దోపిడీ కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి సుమారు 40 మంది మృత్యువాత పడితే వైసిపి ప్రభుత్వం నేటికీ మృతుల కుటుంబాలను ఆదుకోలేదన్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానం చేసి అన్ని విధాలా అభివృద్ధి చేసింది టిడిపి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీతో పాటు పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాజంపేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఒంటిమిట్టలో చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావు తన పిల్లల చదువుల కోసం తన నాలుగు ఎకరాల భూమి అమ్మి ఆర్థిక సమస్యలు తీర్చుకోవాలని చూస్తే వైసిపి నాయకులు ఆయన భూమిని ఆక్రమించి కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్యకు పాల్పడే విధంగా దౌర్జన్యాలకు పాల్పడ్డారని వివరించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వాన్ని అదఃపాతాళానికి తొక్కేయాలని కోరారు. రాష్ట్రంలో రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని సిఎం తీసుకొచ్చారని.. ఇసుక టిప్పర్లపై వారి పేరు ఉంటే ఏ అధికారి ఆపడానికి వీలు లేకుండా దౌర్జన్య పాలన సాగిస్తున్నారని విమర్శించారు. హెరిటేజ్‌ను దెబ్బకొట్టి అమూల్‌ను తీసుకొచ్చారని, శ్రీజ డెయిరీని సమూలంగా నాశనం చేశారని ఆరోపించారు. అమర్‌రాజా ఫ్యాక్టరీని తరిమేశారని, జగన్ పాలనలో ఆడబిడ్డల సంరక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజంపేట నియోజకవర్గం, పార్లమెంటు స్థాయిలో మార్పు తీసుకురావడం యువతతోనే సాధ్యమవుతుందని తెలిపారు. యువత, ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు అనే ఆయుధంతో వైసిపి నాయకులను తరిమికొట్టాలని, ప్రజల ప్రాణాలకు తన ప్రాణాలు అడ్డువేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌డిఎ కూటమి బిజెపి పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, టిడిపి అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమ్మర్తి జగన్‌మోహన్ రాజు, బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఒలెక్ట్రాకు రికార్డ్ నికర లాభాలు

### గతేడాది 8,232 ఇవిలకు ఆర్డర్

**హైదరాబాద్ :** ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒజిఎల్) గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 17.1 శాతం వృద్ధితో రికార్డ్ స్థాయిలో రూ.76.83 కోట్ల నికర లాభాలు సాధించినట్లు తెలిపింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.76.83 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023-24లో మొత్తంగా 8,232 విద్యుత్ వాహనాల ఆర్డర్లను దక్కించుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం తమ చేతిలో 10వేల పైబడిన ఇవి బస్సుల ఆర్డర్ ఉందని వెల్లడించింది. దేశంలో ఏ కంపెనీ ఇంత పెద్ద ఆర్డర్లను కలిగి లేదని తెలిపింది. ఇప్పటి వరకు 1,746 యూనిట్లను డెలివరీ చేసినట్లు వెల్లడించింది.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రెవెన్యూ 5.8 శాతం పెరిగి రూ.1154.14 కోట్లకు చేరింది. '2023-24లో రెవెన్యూ, లాభాల పరంగా బలమైన వృద్ధిని సాధించాము. మా తయారీ సామర్థ్యం పెంచుకోవడంపై దృష్టి కొనసాగుతుంది. అదే విధంగా బలమైన ఆర్డర్ బుక్‌ను కలిగి ఉన్నాము. మా నూతన సీతారాంపూర్ యూనిట్‌లో ఫిబ్రవరి 24న పాక్షిక ఉత్పత్తి ప్రారంభమైంది. తొలి బ్యాచ్ బస్సులను డెలివరీ చేశాము." అని ఒజిఎల్ సిఎండి కెవి ప్రదీప్ తెలిపారు.

## వెల్స్పన్ లివింగ్‌కు రూ.146 కోట్ల లాభాలు

**బెంగళూరు :** దేశీయ టెక్స్‌లైట్ కంపెనీ వెల్స్పన్ లివింగ్ 2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 16 శాతం వృద్ధితో రూ.146 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.125 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.2,153.90 కోట్లుగా ఉన్న అమ్మకాలు.. గడిచిన క్యూ4లో 19.56 శాతం పెరిగి రూ.2,575 కోట్లకు చేరాయ. 2023-24లో కంపెనీ నికర లాభాలు 242.55 శాతం పెరిగి రూ.681 కోట్లుగా.. అమ్మకాలు 19.59 శాతం పెరిగి రూ.9,679 కోట్లుగా నమోదయ్యాయి.

## ఇబ్బడిముబ్బడిగా క్రెడిట్ కార్డుల వాడకం

- ఆన్‌లైన్‌లో రూ.1 లక్ష కోట్ల వ్యయం
- రూ.60 వేల కోట్ల చేరువలో ఆఫ్‌లైన్ లావాదేవీలు
- దేశంలో 10.2 కోట్ల కార్డులు

**న్యూఢిల్లీ :** క్రెడిట్ కార్డు వ్యయాలు రికార్డ్ స్థాయిలో పెరిగాయి. 2024 మార్చిలో తొలిసారి ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డుల ఖర్చులు రూ.1,04,081 కోట్ల మార్క్‌ను అధిగమించాయి. 2024 ఫిబ్రవరిలోని రూ.94,774 కోట్లతో పోలిస్తే 10 శాతం పెరగ్గా.. 2023 మార్చిలో నమోదైన రూ.86,390 కోట్ల వ్యయాలతో పోలిస్తే ఏకంగా 20 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. చిన్న కొనుగోళ్లకూ క్రెడిట్ కార్డులను వినియోగిస్తుండటంతో వీటి పరిమాణం గణనీయంగా పెరిగింది. దీంతో ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్లు రికార్డ్ స్థాయిలకు చేరుతున్నాయి. దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్య 10.2 కోట్లకు చేరింది. గతేడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం పెరిగింది. క్రెడిట్ కార్డులతో ఆఫ్‌లైన్‌లో జరిగే పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) లావాదేవీలూ భారీగానే పెరిగాయి. 2023 మార్చిలో రూ.50,920 కోట్లుగా ఉన్న ఆఫ్‌లైన్‌లో క్రెడిట్ కార్డుల వ్యయాలు.. గడిచిన నెలలో19 శాతం పెరిగి రూ.60,378 కోట్లకు చేరాయి. మొత్తంగా క్రెడిట్ కార్డ్ లావాదేవీలు 20 శాతం పెరిగి రూ.1,64,586 కోట్లకు చేరాయి. క్రెడిట్ కార్డుల జారీలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 20.2 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానంలో ఎస్‌బిఐ 18.5 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 16.6 శాతం, యాక్సిస్ బ్యాంక్ 14 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంక్ 5.8 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. క్రెడిట్ కార్డులు జారీ చేస్తున్న టాప్ 10 బ్యాంకులే మొత్తం 90 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.

## సైయంట్ లాభాల్లో 16% వృద్ధి

**హైదరాబాద్ :** గడిచిన ఆర్థిక సంవత్సం (2023-24) జనవరి నుంచి మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో సైయంట్ కంపెనీ 15.9 శాతం వృద్ధితో రూ.189 కోట్ల నికర లాభాలు సాధించింది. కంపెనీ రెవెన్యూ 6.3 శాతం పెరిగి రూ.1,861 కోట్లకు చేరింది. మొత్తం రెవెన్యూలో డిజిటల్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెగ్మెంట్ 80 శాతం వాటాను కలిగి ఉంది. 2024-25లో తమ సంస్థ ఆర్డర్ బుక్ బలంగా ఉందని.. ఇంటిలిజెంట్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్‌పై పెట్టుబడుల దృష్టి కొనసాగుతుందని సైయంట్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిష్ణ బొడనపు తెలిపారు. గురువారం బిఎస్‌ఇలో సైయంట్ లిమిటెడ్ షేర్ 1.27 శాతం పెరిగి రూ.1,916 వద్ద ముగిసింది.

## సింగిల్ చార్జింగ్‌తో 323 కి.మీ ప్రయాణం

- అల్ట్రావయోలెట్ కొత్త ఇవి బైక్ ఆవిష్కరణ

**బెంగళూరు :** ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఇవి) స్టార్టప్ అల్ట్రావయోలెట్ తాజాగా భారత్ మార్కెట్లోకి తన అల్ట్రావయోలెట్ ఎఫ్77 మ్యాచ్2 మోటార్ సైకిల్‌ను విడుదల చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 323 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చని ఆ కంపెనీ తెలిపింది. ఇది ఇంతకుముందు 2022 చివర్లో ఆవిష్కరించిన అల్ట్రావయోలెట్ ఎఫ్77 మోటారు సైకిల్ అప్ డేటెడ్ వర్షన్ బైక్ అని పేర్కొంది. స్టాండర్డ్, రెకాన్ వేరియంట్లలో లభించే ఈ బైకు తొమ్మిది రంగుల్లో లభ్యమవుతుందని తెలిపింది. ఎక్స్‌షోరూం వద్ద స్టాండర్డ్ వేరియంట్ బైక్ రూ.2.99 లక్షలు, రెకాన్ వేరియంట్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్**
**రిజిస్టర్డ్ ఆఫీస్:** లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 531021.
**కార్పొరేట్ ఆఫీస్:** 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం.7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034, తెలంగాణ, ఇండియా.
టెలిఫోన్: +91 40 3980 4333, ఫ్యాక్స్: +91 040 3980 4320, ఇ-మెయిల్: secretarial@lauruslabs.com, వెబ్‌సైట్: www.lauruslabs.com
**(CIN: L24239AP2005PLC047518)**
**31 మార్చి, 2024తో ముగిసిన సం॥ కొరకు లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ యొక్క ఆడిట్‌చేసిన కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలు & మార్చి 31, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి సిద్ధం చేయడినవి** (రూ.కోట్లలో)

| క్ర. సం. | వివరాలు | త్రైమాసిక ముగింపు | | | సం॥ ముగింపు | |
|---|---|---|---|---|---|---|
| | | 31-Mar-24 | 31-Dec-23 | 31-Mar-23 | 31-Mar-24 | 31-Mar-23 |
| 1 | ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం | 1,439.67 | 1,194.92 | 1,380.90 | 5,040.83 | 6,040.55 |
| 2 | కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటెంలకు ముందు) | 107.27 | 34.62 | 147.14 | 236.36 | 1,108.94 |
| 3 | పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) | 107.27 | 34.62 | 147.14 | 236.36 | 1,108.94 |
| 4 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) | 75.02 | 23.34 | 105.27 | 162.27 | 793.43 |
| 5 | కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం | 77.28 | 22.29 | 105.36 | 159.40 | 787.80 |
| 6 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) అట్రిబ్యూటెడ్ | | | | | |
| | 1) కంపెనీ యొక్క ఈక్విటీ వాటాదారులు | 75.61 | 23.14 | 102.98 | 160.55 | 790.11 |
| | 2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్‌లు | (0.59) | 0.20 | 2.29 | 1.72 | 3.32 |
| 7 | కాలవ్యవధి అట్రిబ్యూటెడ్ కొరకు పూర్తి సమగ్ర ఆదాయం | | | | | |
| | 1) కంపెనీయొక్క ఈక్విటీ వాటాదారులు | 77.87 | 22.09 | 103.12 | 157.68 | 784.53 |
| | 2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్‌లు | (0.59) | 0.20 | 2.24 | 1.72 | 3.27 |
| 8 | ఈక్విటీ వాటా మూలధనం | 107.79 | 107.79 | 107.73 | 107.79 | 107.73 |
| 9 | ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి) మరియు నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్‌లు | | | | 4,003.16 | 3,929.80 |
| 10 | వాటా ఒక్కింటికి రాబడి (రూ.2/- చొప్పున) | | | | | |
| | 1. బేసిక్ : రూ * | 1.40 | 0.43 | 1.90 | 2.98 | 14.69 |
| | 2. డైల్యూటెడ్: రూ * | 1.40 | 0.43 | 1.90 | 2.97 | 14.64 |

* ముగిసిన త్రైమాసికం కొరకు వార్షికం కానివి.

**గమనికలు:**
1. 31 మార్చి, 2024తో ముగిసిన సం॥ కొరకు ఆడిట్‌చేసిన స్టాండలోన్ ఆర్థిక ఫలితాలు మరియు మార్చి 31, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం.

(రూ.కోట్లలో)

| క్ర. సం. | వివరాలు | త్రైమాసిక ముగింపు | | | సం॥ ముగింపు | |
|---|---|---|---|---|---|---|
| | | 31-Mar-24 | 31-Dec-23 | 31-Mar-23 | 31-Mar-24 | 31-Mar-23 |
| 1 | ఆపరేషన్ల నుండి పూర్తి రెవెన్యూ | 1,414.52 | 1,132.19 | 1,279.34 | 4,812.39 | 5,773.45 |
| 2 | పన్నుకు ముందు లాభం | 164.31 | 56.70 | 136.80 | 301.47 | 1,051.43 |
| 3 | పన్ను తరువాత లాభం | 121.32 | 42.64 | 102.28 | 223.70 | 760.38 |
| 4 | కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం | 124.23 | 41.42 | 103.52 | 222.94 | 761.17 |

2) సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజితో దాఖలు చేయబడిన త్రైమాసికం/ సం॥ర కాలానికి ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పై విదంగా ఉన్నవి. త్రైమాసికం/ సం॥ర కాలానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్ మరియు కంపెనీ పేరు నందు www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com నందు అందుబాటులో ఉన్నాయి.

3) ఆడిట్ కమిటీచే సమీక్షించినట్లుగా కంపెనీ యొక్క పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలు ఏప్రిల్ 25, 2024 న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.

బోర్డు ఆదేశం ద్వారా
**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున**
**డా॥ సత్యనారాయణ చావ**
**పూర్తి కాలపు డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్**

ప్రదేశం: హైదరాబాద్
తేది: ఏప్రిల్ 25, 2024

సంపాదకీయం

# అన్నదాతల ఆందోళన

రైతును ఏడిపించే రాజ్యం బాగుపడదని మనం నీతికథల రోజుల నుంచీ వింటూనే ఉన్నాం. దేశానికి రైతే రాజని, వెన్నెముక అని నినాదప్రాయమైన ఉవాచలు పాలకుల ప్రసంగాల నిండా ప్రవహించటం కూడా చూస్తూనే ఉన్నాం. ఇన్నిన్ని ప్రస్తావనలూ, ప్రాచుర్యాలూ అన్నదాతల గురించి ప్రతినిత్యం పల్లవిస్తూనే ఉన్నా- రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతూ ఉంది. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ దుస్థితి మరింతగా విస్తరించింది. అనేక సాగు కష్టాలతో సతమతం అవుతున్న రైతాంగం మోడీ ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు కాక నిత్యం ఆందోళనల దిశగానే సాగాల్సి వచ్చింది. పొలాల్లో, పంటల ఉత్పత్తిలో తలమునకలు కావాల్సిన రైతు- తుండుగుడ్డను తలకు బిగించి, ఢిల్లీ నడివీధిలో పోరాటానికి దిగాల్సి వచ్చింది. ఒకపక్క పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతులు తమ న్యాయబద్ధ డిమాండ్ల మీద వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తుండగా, తాజాగా తమిళ రైతులు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అన్నదాతలను అనేక విధాలుగా అగచాట్ల పాల్జేస్తున్న మోడీ ప్రభుత్వ మోసకారితనంపై ఇది రైతులు మోగించిన రణభేరి.

ఏడేళ్ల క్రితం ఢిల్లీలో చిత్ర విచిత్ర రూపాల్లో నిరసనలు తెలిపిన నేషనల్ సౌత్ ఇండియన్ రివర్స్ ఇంటర్ లింకింగ్ అగ్రికల్చరిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 24 నుంచి ఈ ఆందోళన మొదలు పెట్టారు. స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన విధంగా పంటలకు మద్దతు ధర (సి2 + 50)ను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని వారి డిమాండ్లు. ఇవన్నీ, పదేళ్ల క్రితం అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాలే! కానీ, గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి కొట్టటానికి లక్షలాదిమంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తెరిపివ్వని వర్షాలకు, వణికించే చలికి, వడగాడ్పుల ఎండలకు ... వీటికి మించి మోడీ ప్రభుత్వపు నిర్బంధ, నిరంకుశ చర్యలకూ ఎక్కడా వెనకడుగు వేయకుండా, చెక్కుచెదరకుండా ధీరోదాత్త సమరం సాగించారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తరువాత కూడా వ్యవసాయ రంగాన్ని, రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం డప్పాలు కొడుతోంది.

ఇలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. మూడు, నాలుగు దశాబ్దాలుగా పాలకులు సాగించిన ఉదారవాద ఆర్థిక విధానాలు మన దేశ సేద్యాన్ని కోలుకోలేనంతగా దెబ్బ తీశాయి. 'వ్యవసాయం దండగ' అనే ఒక దౌర్భాగ్యకర స్థితిని, ప్రచారాన్ని పెంచి, పోషించాయి. తదుపరి కార్యక్రమంగా వ్యవసాయ భూములు రైతుల చేతుల నుంచి కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి వెళ్లే కార్యాచరణను రూపొందించాయి. ఈ వికృత వలయంలోంచి భూమి రక్షించబడాలన్నా, రైతు చేనుగట్టు మీద నిశ్చింతగా నిలబడాలన్నా ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను సంపూర్ణంగా అమలు చేయాలి. రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు తగిన అండాదండా ఇచ్చే ప్రణాళికలు రూపొందించి, ఆచరణలో పెట్టాలి. సాగుకు కీడు కలిగించే బిజెపి నయవంచన విధానాల మీద దేశ రైతాంగం తీవ్ర ఆగ్రహంతో ఉంది. గత మార్చిలో మళ్లీ ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళనలు చేపట్టిన రైతుసంఘాలు ఇప్పుడు కాషాయ పార్టీ ఓటమే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో తమిళ రైతులకు నాయకత్వం వహిస్తున్న అయ్యాకన్ను 2014 వరకూ బిజెపిలో ఉన్నవాడే! రైతులకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ మోడీ ప్రభుత్వం నెరవేర్చలేదనే అతడు ఆ పార్టీతో అనుబంధం తెంచుకొని, 2017 నుంచి పోరాటం చేస్తున్నాడు. రైతును క్షోభపెట్టే ఏ ప్రభుత్వమూ అధికారంలో కొనసాగటానికి వీల్లేదు. ఇప్పుడు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరం మోడీ షాలకు అలాంటి పాఠం చెప్పాల్సిన అవసరం ఉంది.

మంచి మాట



యజమాని నిశ్చలత్వాన్ని, నిలకడను కోరుకుంటాడు. పూర్తిగా ఒంటరిగా వుండాలనుకుంటాడు. కాని ఆందోళనకారుడు అలా ఎన్నటికీ కోరుకోడు. కార్మిక సమస్య వెనుక లెక్క కట్టలేనంత శత్రుత్వం దాగి వుంటుంది. కార్మిక ఆందోళనకారులు దీన్ని వెలికితీసి నగ్నంగా ప్రదర్శించడానికి, ఎండగట్టడానికీ అంతిమంగా ప్రపంచంలో అది లేకుండా చేయడానికీ ప్రయత్నిస్తారు.

**- యూజిన్ డెబ్స్,**
అమెరికా సోషలిస్టు పార్టీ నాయకుడు.

# పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సవాళ్లు

విశ్లేషణ

**భారత ప్రజాస్వామ్యానికి పార్లమెంటరీ విధానమే ప్రాణప్రదమైనది. 2024 ఎన్నికలలో బిజెపికి, కూటమికి 400 స్థానాలు వస్తే రాజ్యాంగంలో అనేక మార్పులు చేస్తామని, జమిలి ఎన్నికలు తెస్తామని, 'లౌకిక విధానాన్ని' తొలగిస్తామని బిజెపి పార్లమెంట్ సభ్యులు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష పాలనా విధానం తేవటం బిజెపి ఆలోచనా విధానాలలో వున్నదని అనేకమంది రాజ్యాంగ నిపుణులు, మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికే రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు చేస్తున్నది. రాష్ట్రాల హక్కులు హరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ప్రజల మధ్య మత విభజన చేస్తూ మతతత్వాన్ని రెచ్చగొడుతున్నది. న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై దాడి చేస్తున్నది. న్యాయమూర్తుల నియామకంలో నిబంధనలు పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే దిశలో పౌర సమాజం, మేధావులు, విద్యావేత్తలు, ప్రజలు కృషి చేయవలసి ఉంది.**

**కె.ఎస్. లక్ష్మణరావు**

భారత రాజ్యాంగం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణంగా పేర్కొన్నది. రాజ్యాంగ పరిషత్‌లో భారత రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వుండాలా? లేక అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యం వుండాలా? అనే అంశంపై లోతైన చర్చ జరిగింది. ముసాయిదా కమిటీ సభ్యులు కె.ఎం. మున్షి వంటి కొంతమంది ప్రముఖులు మన దేశంలో అమెరికా తరహా అధ్యక్ష పాలనా విధానం వుండాలని భావించారు. కాని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు అధ్యక్ష పాలనా విధానంలో నియంతృత్వ అధికారాలకు అవకాశం ఉంటుందని, భారతదేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే మేలైనదని వాదించారు. ఫలితంగా భారతదేశంలో పార్లమెంటరీ విధానం కొనసాగుతూ ఇప్పుడు పద్దెనిమిదవ సాధారణ ఎన్నికలు జరుగుతున్నాయి. బిజెపి గతంలో కూడా అనేక సందర్భాలలో దేశంలో అధ్యక్ష పాలన అవసరం గురించి తెలిపింది. నరేంద్ర మోడీ గత దశాబ్ద కాలంగా పార్లమెంటరీ విధానంలో అధ్యక్ష తరహా పద్ధతులను అనుసరిస్తూ, పరోక్షంగా దేశాన్ని అధ్యక్ష తరహాలోనే పాలిస్తున్నారు.

**పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజ్యాంగ నిబంధనలు**

భారత రాజ్యాంగంలోని 5వ భాగంలో రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని స్పష్టంగా పొందుపరిచారు. రాష్ట్రపతి భారత రాజ్యాధినేతిగా వ్యవహరిస్తూ నామమాత్ర అధికారాలు కలిగి వుంటారు. ప్రధాన మంత్రి నాయకత్వాన గల మంత్రిమండలి సమిష్టిగా నిర్ణయాలు చేస్తూ, పార్లమెంట్‌కు బాధ్యత వహించాలి. లోక్‌సభ, రాజ్యసభలు పార్లమెంట్‌గా వ్యవహరిస్తూ లోక్‌సభ నుండి 543 మంది, రాజ్యసభలో 250 మంది సభ్యులు వుంటారు. మంత్రిమండలి సభ్యులందరూ లోక్‌సభ లేదా రాజ్యసభ సభ్యులై ఉండాలి. లోక్‌సభలో మెజారిటీ ఉన్నంత కాలమే మంత్రిమండలి అధికారంలో ఉంటుంది. దీని అర్థం మంత్రిమండలి సమిష్టిగా పని చేస్తూ దేశానికి సంబంధించిన నిర్ణయాలు చేయాలి. గత పదేళ్లుగా భారత దేశంలో సమిష్టి నిర్ణయాలు, సమిష్టి బాధ్యతా సూత్రాలు అమలు జరగకుండా నరంద్ర మోడీ ఏకపక్ష నిర్ణయాలు అమలు చేస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసే విధంగా పని చేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు విషయం కనీసం క్యాబినెట్ మంత్రులకు కూడా తెలియకపోవడం దీనికి ఉదాహరణ.

**సాంప్రదాయాలు పాటించని ప్రధాని**

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సాంప్రదాయాలు ఒక భాగం. ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోడీ కనీస సాంప్రదాయాలు పాటించడం లేదు. పార్లమెంట్ సమావేశాలలో నరేంద్ర మోడీ తక్కువ రోజులు మాత్రమే హాజరవుతున్నారు. ఒకవైపు పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా నరేంద్ర మోడీ అనేక సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారు. మణిపూర్‌లో జరిగిన మారణహోమం సమస్యలపై కూడా అయన పార్లమెంట్‌లో మాట్లాడ్డానికి ఇష్టపడలేదు. ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన తరువాత మాత్రమే సభలో సమాధానం చెప్పారు. వ్యవసాయ చట్టాలు వంటి అనేక బిల్లులను చర్చ లేకుండానే పార్లమెంట్‌లో ఆమోదింపచేశారు. మూజువాణి ఓటుతో చర్చ లేకుండానే బిల్లులను ఆమోదించడం పరిపాటిగా మారింది. భారత రాష్ట్రపతి భారత రాజ్య అధిపతిగా వ్యవహరిస్తారు. ఆ పదవిని గౌరవించడం ప్రధానమంత్రి కనీస బాధ్యత. రాజ్యాంగంలో 79వ నిబంధన ప్రకారం పార్లమెంట్ అంటే "రాష్ట్రపతి, రాజ్యసభ మరియు లోక్‌సభ". అంటే రాష్ట్రపతి పార్లమెంట్‌లో రాష్ట్రపతి భాగంగా ఉంటారు. నూతన పార్లమెంట్ భవన ప్రారంభం రాష్ట్రపతి చేత చేయించాలి. నరేంద్ర మోడీ ప్రారంభించిన నూతన పార్లమెంట్ భవన ఉత్సవానికి రాష్ట్రపతిని కనీసం ఆహ్వానించలేదు. ఇటీవల ఎల్.కె అద్వానీకి "భారత రత్న" అవార్డు ప్రదాన సమయంలో... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలబడి అద్వానీకి (వృద్ధాప్య కారణంగా) అందించగా, ఆ సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ నిలబడకుండా కూర్చొని వుండడం ఆయన వ్యక్తిగత అహంభావ ధోరణిని తెలుపుతున్నది. నరేంద్ర మోడీ ధోరణులు సమిష్టి బాధ్యతతో వ్యవహరించే ప్రధానమంత్రి వలే కాకుండా, ఏకపక్ష ధోరణితో వ్యవహరించే అధ్యక్ష పాలన తరహాలో వుంటున్నది.

**కార్పొరేట్ రాజకీయాలు - కేంద్రీకరణ**

భారతదేశంలో విస్తృతంగా పెరిగిన కార్పొరేట్ రాజకీయాలు కూడా రాజకీయ అధికార కేంద్రీకరణకు దారితీశాయి. 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు గత మూడు దశాబ్దాలుగా అన్ని రంగాలలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణకు దారితీసి, కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున పెరిగాయి. కొర్పొరేట్ రంగ ప్రభావం రాజకీయ రంగంపై కూడా పడింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత 4 దశాబ్దాల పాటు ఎన్నికలలో ప్రజాసేవ దృక్పథం కలవారు, సామాజిక కార్యకర్తలు, రాజకీయాల ద్వారా ప్రజాసేవ చేయాలనే ఆలోచన కలవారు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై ప్రజలకు సేవలు అందించారు. నిజాయితీగా పని చేశారు. కాని గత మూడు దశాబ్దాలలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలు తెచ్చిన మార్పులు రాజకీయ రంగంపై 'పెద్ద ప్రభావాన్ని చూపాయి. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా వ్యాపారవేత్తలు, ఎన్నారైలు వివిధ సంస్థల అధిపతులను నిలబెట్టి రూ. వేల కోట్లు ఖర్చు చేయటం ప్రారంభమైనది. వారు గెలిచిన తరువాత "క్రోనీ క్యాపిటలిజం" విధానాల ద్వారా లబ్ధి పొందటం, తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవటం జరుగుతున్నది. "క్రోనీ క్యాపిటలిజం" విధానాల ద్వారా భూములు, మైనింగ్ (ఖనిజ దోపిడి), ఇసుక, సెజ్‌లు మొదలగు వాటి ద్వారా ప్రజాప్రతినిధులు లబ్ధి పొందుతున్నారు. అటవీ సంపద, సహజ వనరులు పెద్ద ఎత్తున దోపిడి జరుగుతున్నాయి.

గత పదేళ్లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ రాజకీయాలను పెంచి ప్రోత్సహిస్తున్నది. దాదాపు రూ.15 లక్షల కోట్లు కార్పొరేట్లను రాయితీగా ఇచ్చారు. గౌతమ్ అదానీ, అంబానీ వంటి వారి సంస్థలు కార్పొరేట్ విధానాల ద్వారా బలోపేతమైనాయి. గౌతమ్ అదానీ ఆస్తుల విలువ 2014లో రూ.50 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి రూ.11 లక్షల కోట్లకు చేరాయి. ఓడరేవులు, బొగ్గు, విమానాశ్రయాలు, విద్యుత్ మొదలగు రంగాలలో గౌతమ్ అదానీ కంపెనీలు పూర్తిగా లబ్ధి పొందే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలు కొనసాగాయి. మన రాష్ట్రంలో కూడా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదానీ కంపెనీలకు లాభం చేకూరే విధంగా నిర్ణయాలు చేసింది. దేశంలో కార్పొరేట్ రాజకీయాలు నిజాయితీగల వ్యక్తులకు, సామాజిక కార్యకర్తలకు, సామాజిక నిబద్ధత గలవారికి స్థానం లేకుండా చేశాయి. లోక్‌సభకు పోటీ చేయాలంటే రూ.100 కోట్లు, శాసనసభకు పోటీ చేయాలంటే కనీసం రూ.20 కోట్లు ఖర్చు చేసే అభ్యర్థుల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు అన్వేషిస్తున్నాయి. ఈ ధోరణులు సాధారణ కార్యకర్తల పాత్ర తగ్గించటమే కాకుండా, రాజకీయ పార్టీలు కార్పొరేట్ స్వభావాన్ని సంతరించుకున్నాయి. కార్పొరేట్ రాజకీయాలలో జరిగే రాజకీయ అధికార కేంద్రీకరణకు నరేంద్ర మోడీ నిలువెత్తు ఉదాహరణగా చెప్పవచ్చు. కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ మీడియా నరేంద్ర మోడీని ఆకాశం ఎత్తులో నిలబెడుతున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కార్పొరేట్ సంస్థలకు కూడా ఇష్టం లేదు.

**భిన్న పార్టీలను సహించని ధోరణి**

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో భిన్నమైన రాజకీయ పార్టీలు వుంటాయి. భారత దేశంలోగల భిన్నత్వానికి అనుగుణంగా దేశంలో బహు పార్టీ విధానం రూపు దిద్దుకున్నది. ప్రాంతీయ ఆకాంక్షలకు అనుగుణంగా అనేక పార్టీలు ఏర్పడ్డాయి. కేంద్రంలో ఒక పార్టీ అధికారంలో వుంటే రాష్ట్రంలో భిన్నమైన పార్టీలు అధికారంలో వుంటున్నాయి. వాస్తవంగా 1989 నుండి 2014 మధ్య కేంద్రంలో కూడా సంకీర్ణ ప్రభుత్వాలే కొనసాగాయి. ఇప్పుడు కేంద్రంలో బిజెపి అధికారంలో వుంటే కేరళలో ఎల్‌డిఎఫ్, తమిళనాడులో డిఎంకె, బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్, ఒడిషాలో బిజు జనతాదళ్, తెలంగాణలో, కర్ణాటకలో కాంగ్రెస్...మొదలైన పార్టీలు అధికారంలో వున్నాయి. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్య లక్షణం. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి గాని, దాని నాయకులైన నరేంద్ర మోడీ, అమిత్ షా లకు ఇది నచ్చటం లేదు. అన్ని రాష్ట్రాలలో తమ ప్రభుత్వాలు గాని, తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాలు గాని వుండాలని వారు కోరుకుంటున్నారు. దీని కోసం రాష్ట్రాలలో తమకు నచ్చని ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టడం పెద్ద ఉదాహరణగా చెప్పవచ్చు. మహారాష్ట్రలో శివసేనను చీల్చివేసి, ఒక భాగంతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతీయ పార్టీలను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా అనేక రకాల ఇబ్బందులు పెడుతున్నారు. తాము దారిలోకి తెచ్చుకోవలసిన రాజకీయ నాయకుల పైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, ఇన్‌కంటాక్స్, ఎన్ఐఎ, ఐడబ్ల్యుఐ...కేంద్ర దర్యాప్తు, నిఘా సంస్థలను ఉసిగొల్పుతున్నాయి. తమకు నచ్చని రచయితలు, పాత్రికేయులు, మీడియా సంస్థలను వేధిస్తున్నారు. న్యూస్‌క్లిక్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థను అరెస్ట్ చేసి అక్టోబర్ నుండి జైలులో వుంచారు. ఈ విధంగా భిన్నమైన రాజకీయ పార్టీల నాయకులను, వ్యక్తులను వేధించటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పూర్తి విరుద్ధం.

**పార్లమెంటరీ ప్రజాస్వామ్యం!**

భారత ప్రజాస్వామ్యానికి పార్లమెంటరీ విధానమే ప్రాణప్రదమైనది. 2024 ఎన్నికలలో బిజెపికి, కూటమికి 400 స్థానాలు వస్తే రాజ్యాంగంలో అనేక మార్పులు చేస్తామని, జమిలి ఎన్నికలు తెస్తామని, 'లౌకిక విధానాన్ని' తొలగిస్తామని బిజెపి పార్లమెంట్ సభ్యులు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష పాలనా విధానం తేవటం బిజెపి ఆలోచనా విధానాలలో వున్నదని అనేకమంది రాజ్యాంగ నిపుణులు, మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికే రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు చేస్తున్నది. రాష్ట్రాల హక్కులు హరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ప్రజల మధ్య మత విభజన చేస్తూ మతతత్వాన్ని రెచ్చగొడుతున్నది. న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై దాడి చేస్తున్నది. న్యాయమూర్తుల నియామకంలో నిబంధనలు పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే దిశలో పౌర సమాజం, మేధావులు, విద్యావేత్తలు, ప్రజలు కృషి చేయవలసి ఉంది.

**/ వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,**
**సెల్ : 8309965083 /**

# చిత్తశుద్ధి లేని బ్లింకెన్ పర్యటన

వ్యాఖ్య

**నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లుగా జో బైడెన్-డోనాల్డ్ ట్రంప్ పోటీ పడుతున్నారు. తమ కార్పొరేట్లకు రాయితీలు సాధించేందుకు ఒక వైపు ఒత్తిడి మరోవైపు తెగేదాకా లాగేందుకు సిద్ధం కాని స్థితిలో బ్లింకెన్ పర్యటన సాధించేదేమీ ఉండదనే విశ్లేషణలు ముందే వెలువడ్డాయి. తమ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తప్ప చైనాతో వివాద పరిష్కారానికి సిద్ధంగా లేనట్లు బ్లింకెన్ పర్యటనకు ముందు అమెరికా చర్యలున్నాయి. చైనాతో అమీతుమీ తేల్చుకొనేందుకే ఉన్నాం అన్నట్లుగా కనిపించేందుకు రెండు ప్రధాన పార్టీలు చూస్తున్నాయని న్యూయార్క్‌టైమ్స్ పత్రిక పేర్కొన్నది. రెండు దేశాల మధ్య ఉక్రెయిన్ వివాదం, మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలు, తైవాన్, దక్షిణ చైనా సముద్ర అంశాల మీద ఏకాభిప్రాయం లేదని ఎపి వార్తా సంస్థ విశ్లేషించింది. వీటిలో ఏ ఒక్కదాని మీద రెండు దేశాల మధ్య సయోధ్య కుదిరే అవకాశమే లేదు.**

హాలీవుడ్ సినిమాల్లో అనకొండ మాదిరి చైనాను మింగివేయాలన్నంత కసి ఉంది. మాయ కొండచిలువల గురించి ఇతరుల కంటే సృష్టించిన తమకే నిజానిజాలేమిటో తెలుసు గనుక అమెరికన్లు వాస్తవాలను మింగలేక కక్క లేకుండా ఉన్నారు. బీజింగ్‌తో పూర్తి స్థాయి పోరుకు దిగితే కొన్ని అమెరికా కార్పొరేట్లకు కోపం లేకపోతే మరికొన్నింటికి ఆగ్రహం. పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రలో ఇలాంటి పరిస్థితి గతంలో లేదు. శ్వేత సౌధంలో గాడిద (డెమోక్రాట్లు)-ఏనుగు (రిపబ్లికన్లు) పార్టీ నేతలు ఎవరు ఉన్నా దారీ తెన్నూ తేల్చుకోలేని డోలాయమానంలో పడ్డారు. పర్యవసానాలను ఊహించలేక డోనాల్డ్ ట్రంప్ 2018లో చైనాతో ప్రారంభించిన వాణిజ్య పోరును గెలవలేక, గౌరవ ప్రదంగా ముగించలేక అమెరికా పాలకవర్గం సతమతమౌతోంది. ఏం చేస్తారో చేసుకోండి అన్నట్లుగా చైనా తన పని తాను చేసుకుపోతోంది. ఈ పూర్వ రంగంలో శుక్రవారం వరకు జరిపే పర్యటన నిమిత్తం అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బుధవారం నాడు చైనా గడ్డపై కాలుమోపాడు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా తమ భవిష్యత్ గురించి చైనాలో ఉన్న అమెరికా కంపెనీలు ఆందోళన వెల్లడిస్తూ ఈ సందర్భంగా ఒక నివేదికను వెల్లంచాయి. చైనా మార్కెట్ ఆకర్షణ వారిని అక్కడే ఉండాలని కట్టిపడేస్తోంది. నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లుగా జో బైడెన్-డోనాల్డ్ ట్రంప్ పోటీ పడుతున్నారు. తమ కార్పొరేట్లకు రాయితీలు సాధించేందుకు ఒక వైపు ఒత్తిడి మరోవైపు తెగేదాకా లాగేందుకు సిద్ధం కాని స్థితిలో బ్లింకెన్ పర్యటన సాధించేదేమీ ఉండదనే విశ్లేషణలు ముందే వెలువడ్డాయి. తమ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తప్ప చైనాతో వివాద పరిష్కారానికి సిద్ధంగా లేనట్లు బ్లింకెన్ పర్యటనకు ముందు అమెరికా చర్యలున్నాయి. చైనాతో అమీతుమీ తేల్చుకొనేందుకే ఉన్నాం అన్నట్లుగా కనిపించేందుకు రెండు ప్రధాన పార్టీలు చూస్తున్నాయని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొన్నది. రెండు దేశాల మధ్య ఉక్రెయిన్ వివాదం, మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలు, తైవాన్, దక్షిణ చైనా సముద్ర అంశాల మీద ఏకాభిప్రాయం లేదని ఎపి వార్తా సంస్థ విశ్లేషించింది. వీటిలో ఏ ఒక్కదాని మీద రెండు దేశాల మధ్య సయోధ్య కుదిరే అవకాశమే లేదు.

అమెరికా తప్పుడు అంచనాలు, వైఖరితో వివాదాలు మరింతగా పెరుగుతున్నాయి తప్ప తగ్గటం లేదు. నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించినట్లుగా అమెరికా తీరు ఉంది. తాజాగా చైనా సముద్ర రవాణా, నౌకా నిర్మాణ సంబంధిత అంశాలపై దర్యాప్తు జరపాలని నిర్ణయించింది. రష్యాకు ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకొనేందుకు గాను ప్రపంచ ద్రవ్య వ్యవస్థ నుంచి కొన్ని చైనా బ్యాంకులను దూరం చేయాలన్న సూచనలను కూడా వెల్లడించింది. రష్యా పారిశ్రామిక పునాది పునర్ నిర్మాణానికి, మిలిటరీ ఉత్పత్తులకు అవసరమైన చిప్స్ మొదలు ఖండాంతర క్షిపణులకు కావాల్సిన ఇంజన్లను చైనా సరఫరా చేస్తున్నదని అమెరికా ఆరోపిస్తోంది. దక్షిణ చైనా సముద్ర వివాదం పేరుతో జపాన్, ఆస్ట్రేలియాలను ఫిలిప్పీన్స్‌కు మద్దతుగా సమీకరించేందుకు పూనుకుంది. మానవ హక్కులపై తప్పుడు ప్రచారం, తైవాన్‌కు ఆయుధ సరఫరా సరేసరి. ఈ అంశాలపై అమెరికాకు ఓటమే తప్ప విజయం కనుచూపు మేరలో కనిపించటం లేదు. స్వజనాన్ని, బయటి వారినీ ఎంతకాలమో మభ్యపెట్టే అవకాశమూ కనిపించక పోవటంతో ఒత్తిడి, గారడీలకు పాల్పడుతోంది.

చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోనుందని అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మీడియా, ఆర్థికవేత్తలు చెప్పిన జోశ్యం ఒక్కటీ నిజమయ్యే దాఖలాలు లేవు. ఒకవైపు పతనం కానుందని చెబుతూనే తమకు ప్రధాన పోటీదారుగా ఉందని, చైనాను అదుపు చేయాలని అమెరికా అంటోంది. కూలిపోయేదానితో జగడమెందుకు? ఒక వైపు తమను అణచివేయాలని చూస్తున్న అమెరికా మరోవైపు తన పాటలకు అనుగుణ్యంగా నృత్యం చేయాలని కోరు కుంటోందని ఇదెలా సాధ్యమని చైనా ప్రశ్నిస్తోంది. ఆంక్షలతో నిమిత్తం లేకుండా రష్యాతో సహా అన్ని దేశాలతో తాము సాధారణ ఆర్థిక, వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తామని, తమ హక్కుల్లో జోక్యం చేసుకోవద్దని పదే పదే స్పష్టం చేస్తోంది. తమ మీద రుద్దిన వాణిజ్య, సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై ఆంక్షలను ఎత్తివేయాలని, దక్షిణ చైనా సముద్రం, తైవాన్ అంశంలో జోక్యం చేసుకోవద్దని, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను పాటించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. వీటి మీద రాజీ పడేందుకు అమెరికా పాలకవర్గం సిద్ధంగా వుందా ?

**- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్**

బేతాళం- 2

# మంగళసూత్రం!

విక్రమార్కుడు చెట్టుమీద శవాన్ని దించి, భుజాన వేసుకుని రోజూ కంటే వేగంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు...విక్రమార్కుణ్ణి ఎలాగైనా డిస్టర్బ్ చేయాలనుకున్నాడు. ఓ సినిమా పాట అందుకున్నాడు. 'మంగళసూత్రం అంగడి సరుకా/ కొనగలవా చెయి జారకు/ లాభం ఎంతొచ్చిందమ్మా/ సౌభాగ్యం అమ్మేశాక/...అమ్మితేమ్ చెల్లించి ఆ విలువకే/ హాలాహలం కొన్నావే అతితెలివితో/ కురిసే ఈ కసురులకిది తడిసే నిరుపేదైనావే' అంటూ కులాసాగా పాడుతున్నాడు. విక్రమార్కుడికి ఒళ్లు మండుతోంది ఆ పాట వినేసరికి. మౌనానికి భంగం కలిగితే... బేతాళుడు మళ్లీ చెట్టు మీదకు చేరుకుంటాడేమోనని...బేతాళుని గార్దభ స్వరాన్ని భరిస్తూ నడుస్తున్నాడు. విక్రమార్కుడి అసహనాన్ని గమనించిన బేతాళుడు...'రాజా, మహిళలంటే నీకెంత గౌరవమో నాకు తెలుసు. కానీ, మహిళలను అగౌరవ పరుస్తూ...వారి సెంటిమెంట్‌ని 'హేళనగా చూస్తున్న ఓ దేశాధినేత కథ చెప్తా. సావధానంగా వినుకో...' అంటాడు.

'అనగనగా సింధియా అనే దేశాన్ని జేడీ అనే నిరంకుశ రాజు పాలిస్తున్నాడు. ఈ జేడీ సైన్యం మొత్తం ఎదుటి పార్టీల వాళ్లు మీ మంగళసూత్రం, బంగారం లాక్కోవాలను కుంటున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. గత రాజులందరూ పార్టీలకు అతీతంగా దేశ ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారు. అయితే నేడున్న జేడీ రాజు ప్రభుత్వంలో అబద్ధాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. నైతికత లేని జేడీ ప్రజల ముందు నాటకాలు ఆడుతున్నారని, సత్యమార్గాన్ని అవలంబించడంలేదని ప్రతిపక్ష రాజులు విమర్శిస్తున్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం, వారి బ్యాంకు ఖాతాలు జప్తు చేయడం, ముఖ్య నాయకులను జైల్లో పెట్టడం ద్వారా విపక్ష రాజులను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పదేళ్లలో జేడీ ప్రభుత్వం ప్రజల కోసం ఏ పనీ చేయలేదన్నది నిజం.

సింధియా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో ఎప్పుడు ఎవరైనా బంగారం లాక్కున్నారా? మహిళల మంగళసూత్రాలు గుంజుకున్నారా? అసలు ఈ దేశంలోని మహిళలు మంగళ సూత్రానికి ఎంత ప్రాముఖ్యతనిస్తారో ఈ జేడీ రాజుకు తెలుసా? అంతేకాదు, దేశంలో నోట్ల రద్దు జరిగినప్పుడు మహిళల పొదుపు సొమ్మును ఎత్తుకెళ్లారు. దేశ రాజధానిలో 600 మంది రైతుల ప్రాణాలు బలిగొన్న జేడీ... ఆ రైతుల భార్యల 'మంగళసూత్రం' గురించి ఎప్పుడైనా ఆలోచించాడా? మణిపూర్‌లో మహిళను వివస్త్రగా ఊరేగించినప్పుడు, ఆమె 'మంగళసూత్రం' గురించి ఆలోచించాడా? అవేమీ పట్టించుకోని జేడీ, మహిళలను భయపెట్టి ఓటు వేయించుకోవాలని చూస్తున్నాడు. సత్య మార్గంలో నడవడం, సేవా దృక్పథం కలిగివుండటం ఏ రాజుకైనా అవసరం. కానీ, జేడీ రాజు వాటన్నింటినీ అతిక్రమించి మత రాజ్య విస్తరణ కాంక్షతో రగిలిపోతున్నాడు.

జేడీ అంత గొప్ప రాజైతే... అంత పలుకుబడి వుంటే, ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను కూడా ఒక్క క్షణంలో ఆపగల శక్తివంతుడైతే... ఉపాధి, విద్య, ఆరోగ్య సౌకర్యాల గురించి ఎందుకు మాట్లాడరు. అతన్ని ఎవరూ ప్రశ్నించలేనంత ప్రభావం ఆయనకు ఉంటే, ఉపాధి కల్పించడంలో ఎందుకు విఫలమయ్యాడు? ద్రవ్యోల్బణం ఎందుకు తగ్గించలేక పోయాడు? యువత కోసం కొత్త పథకం ఎందుకు తీసుకు రాలేదు? దేశంలోని లక్షలాది కుటుంబాల్లో ఎందుకు అభివృద్ధి జరగలేదు? మైనారిటీలపైన, గిరిజనులపైన ఎందుకు కత్తి కట్టాడు? జేడీ పరివారం ఆవేశపూరితమైన, దారి మళ్లించే అంశాలనే ఎందుకు మాట్లాడుతున్నారు?

రాజా...నేను అడిగిన ప్రజలకు ఆలోచించి జవాబు చెప్పు. తెలిసి కూడా జవాబు చెప్పకపోయావో...నీ తల వెయ్యి ముక్కలవుతుంది' అంటాడు బేతాళుడు.

'బేతాళా...నువ్వు చెప్పినవన్నీ నిజాలే. గతంలోనూ నిరంకుశ రాజులు, కుట్రలు, కుతంత్రాలు వున్నా...మరీ ఇంత ఉన్మాదం లేదు. ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునేవారు. మహిళల పట్ల ఎంతో గౌరవంగా వుండేవారు. మీరు చెప్పినట్టుగా... జేడీ రాజుకు ప్రాణాలతో పనిలేదు. మత రాజ్య స్థాపనే ఆయన లక్ష్యం. దానికోసం ఎన్ని ప్రాణాలను బలిపెట్టడానికైనా ఆయన వెనకాడడనిపిస్తోంది. ముఖ్యంగా మీ సింధియా దేశ మహిళల్లో మంగళసూత్రం పట్ల వుండే సెంటిమెంట్‌ని వాడుకొని, వారి ఓట్లను దండుకో వాలనుకుంటున్నాడని ఎవరికైనా ఇట్టే అర్థమౌతుంది. అధికారం కోసం, మత రాజ్య స్థాపన కోసం వాళ్లు ఎంతకైనా తెగిస్తారు. కనుక సింధియా ప్రజలు అప్రమత్తంగా, జాగరూకులై వుండాలి' అని జవాబిచ్చాడు.

'భేష్...విక్రమార్కా...నీ సమాధానం అద్భుతం. ఈ విషయం ప్రజలకు ఎప్పుడు అర్థమౌతుందో. అయినా ప్రజలు అంత తెలివితక్కువ వారేం కాదులే. ఆ మహిళలే జేడీ పరివారానికి బుద్ధి చెప్తారు. బాయ్ రాజా... మళ్లీ కలుద్దాం...' అంటూ శవంతో సహా మాయమయ్యాడు బేతాళుడు.

**- రాజాబాబు కంచర్ల,**
**9490099231**